ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

శుక్రవారం 3 మే 2024



టీడీపీ హయాంలో నిర్మించిన దశతోనే ఆగిపోయిన బాపట్ల మున్సిపల్ హైస్కూల్ తరగతి గదుల సముదాయం



రామాపురం రోడ్డులో పంట కాల్వను పూడ్చి చదును చేసిన దృశ్యం

పంట కాల్వ పూడ్చేశారు

- వెంచర్ కోసం కాల్వ ఆక్రమణ
- అధికారుల మౌనంపై రైతుల ఆగ్రహం
- చీరాలలో బరితెగిస్తున్నా రియల్ వ్యాపారులు

చీరాల, మే 2: నీటి వనరులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఛిద్రం చేయకూడదు. అందుకు సంబంధించి హైకోర్టు, సుప్రీంకోర్టు, ఎన్‌జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు, ఆదేశాలు ఉన్నాయి. పొలాల్లో అధికారుల అనుమతి లేకుండా ప్లాట్లు వేయరాదు. కానీ వీటిని రియల్ వ్యాపారులు ఖాతరు చేయడంలేదు. సాగునీరు పారాల్సిన కాల్వలు, పంటలు పండాల్సిన భూములను రియల్ వ్యాపారులు కాసులకు కేంద్రాలుగా మార్చేస్తున్నారు. జాతీయ రహదారి 216 వెంట కొత్తపేట నుంచి రామాపురం వెళ్లేదారిలో అబ్దుల్ కలామ్ కాలనీ సమీపంలోని పంట కాల్వను పూడ్చేవారు. దానివెంట పొలాల్లో ఎలాంటి అనుమతులే లేకుండా ప్లాట్లు వేసేందుకు పనులు ప్రారంభించారు. అధికారులు ఎన్నికల హడావుడిలో ఉండగా ఇదే అవకాశంగా అతడు కాల్వను పూడ్చేశారు. కాల్వ కింద రైతులు వరి, వేరుశనగ, మినుము తదితర పంటలను సాగు చేస్తుంటారు. ఆ ప్రాంత రైతులకు ఈ పంట కాలువే సాగునీటి వనరు. ఈ కాల్వను ఎలా పూడుస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. కాల్వలో పైపు వేసి రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామని ఆ వ్యక్తి చెప్తున్నారు. ఒకరిని చూచి మరొకరు అన్నట్లుగా రోడ్డు మార్జిన్ స్థలాన్ని కలుపుకునేందుకు తాము వేసే వెంచర్ ప్లాట్లు ముందు అందంగా కనిపించేందుకు కాల్వను పైపులు వేసి చదును చేస్తుంటే అధికారుల్లో కదలిక లేదు. నీటి వనరులకు సంబంధించి ఏదైనా ప్రత్యామ్నాయ చర్య చేపట్టాలన్నా నీటి పారుదల, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి పక్కాగా అనుమతి పొందాలి. అయితే ఇదేమీ లేకుండా కాల్వను పూడ్చినా పట్టించుకోలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పంట కాల్వలో సాగునీరు సక్రమంగా పారుదల జరగపోతే కొన్ని వేల ఎకరాల భూములకు సాగునీరు అందక బీడుబారే ప్రమాదం పొంచి ఉందని రైతులు వాపోతున్నారు. ఎన్నికల హడావుడి అని చెప్పకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపట్టాలని రైతులు, ప్రజలుకోరుతున్నారు.

పంటకాల్వను పూడ్చరాదు

- ప్రసాద్, డీఈఈ చీరాల

నీటి వనరుల రూపుమార్చే అధికారం ఎవరికీ లేదు. ఒకవేళ ఎవరన్నా అలాంటి చర్యలకు పాల్పడితే అది నేరం. కొత్తపేట, రామాపురం మధ్య నున్న పంట కాలువ నీటి పారుదల శాఖ పరిధిలోకి వస్తుందా లేకుంటే ఐడీసీ కిందికు వస్తుందా పరిశీలించి చర్యలు చేపడతాం.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

- హజరత్తయ్య, ఐడీసీ, ఈఈ, ఒంగోలు

కొత్తపేట, రామాపురం మధ్య ఉన్న పంట కాలువ ప్రస్తుతం తమ డిపార్ట్‌మెంట్ పర్యవేక్షణలో ఉందా, లేదంటే నీటిపారుదలశాఖ పరిధిలో ఉందా, లేదంటే రైతు కమిటీల పరిధిలో ఉందో చూడాలి. అందుకు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తాం. ఆ తర్వాత అనుగుణంగా చర్యలు ఉంటాయి.

నాడు.. నేడు.. ఎక్కడికక్కడే

- నిధులు ఇవ్వక సాగని పనులు
- ప్రకటనల్లో గొప్ప.. ఆచరణలో అధోగతి
- చిత్తశుద్ధి లోపంతో పనుల పురోగతి అంతంతే
- విద్యా సంవత్సరం ముగిసినా పూర్తి కాని పనులు

నాడు - నేడు అద్భుతం అన్నారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పన్నారు. కార్పొరేట్ పాఠశాలల్లోని సౌకర్యాలను ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించామన్నారు. రెండు విడతల్లో చేపట్టిన నాడు-నేడు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో 3161 పాఠ శాలల్లో వేల పనులు చేపట్టారు. ఆర్భాటపు ప్రకటనలతో సరి పుచ్చిన ప్రభుత్వం నిధులు విడుదలపై నిర్లక్ష్యం చూపింది. దీంతో పలు పాఠశాలల్లో అరకొరగా.. కొన్ని దగ్గర్ల సగంలో ఆగి పోయి.. మరికొన్ని పాఠశాలల్లో అయితే మొదలే కాని పనులతో నాడు-నేడు అధ్వానంగా మారింది. రెండు విడతల్లోనూ పనులు సక్రమంగా జరగక విద్యార్థులు తీవ్రం గా ఇబ్బంది పడాల్సి వచ్చింది. మూడు జిల్లాల్లో రూ.699.25 కోట్లు పనులు చేపట్టగా రూ.352.82 కోట్లు మాత్రమే విడుదల అయ్యాయి. అంటే సగం పనులు కూడా సక్రమంగా జరగలేదని అర్థమవుతోంది. నిధులు కొరతతో వందల పాఠశాలల్లో పనులు అర్ధాం తరంగా నిలిచి పోయాయి. కొన్ని పాఠశాలల్లో పనులను సాగదీ స్తున్నారు. అయితే అధికార పార్టీ నేతలు గత కొన్ని రోజులుగా ఎన్నికల ప్రచారంలో నాడు-నేడు మా గొప్ప అంటూ ఆర్భాటపు ప్రకటనలు చేసుకుంటున్నారు.

బాపట్ల జిల్లా..

బాపట్ల జిల్లాలో 944 పాఠశాలల్లో 183.31 కోట్ల అంచనాతో పనులు చేపట్టగా ఇప్పటికి రూ.92.72 కోట్ల పనులు మాత్రమే పూర్తయ్యా యి. 6,274 పనులకు 4,104 పనులు పురోగతిలో ఉన్నాయి. 2,083 పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. 96 ప్యాకేజీల్లో 112 పాఠశాలల్లో 279 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టగా 16 ప్యాకేజీల్లో మాత్రమే గదుల నిర్మాణం పూర్తి చేశారు. 326 మరుగుదొడ్ల బ్లాక్‌లకు 163 చోట్ల పనులు పూర్తి అయ్యాయి. 78 పాఠశాలలకు ప్రహరీ పనులు మంజూరు కాగా తొమ్మిది పనులు పూర్తయ్యాయి. 327 విద్యుత్ పనులకు 215, 586 మరమ్మతు పనులకు 157 పూర్తయ్యాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాడు నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశాం.. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాం.. అంటూ ముఖ్యమంత్రి జగన్ చెప్తోన్న గొప్పలు క్షేత్రస్థాయిలో ఎక్కడా కానరావడంలేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే చెప్తున్నారు. చెప్పేది ఒకటి చేసేది ఒకటిగా జగన్‌మామ తీరుందని విమర్శిస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందే కాని అరకొరగా విడుదలతో సరిపెట్టింది. దీంతో పూర్తి చేసిన పనులకే బిల్లులు మంజూరు కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. రెండేళ్లుగా.. రెండు విడతల్లో చేపట్టిన పనులు మూడో ఏడు విద్యా సంవత్సరం ఆరంభం అవుతున్నా ఒక కొలిక్కిరాలేదు. అంటే రెండు వేసవి సెలవులు ముగిసినా పనులు పూర్తి చేయడంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించారన్న విమర్శలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వస్తున్నాయి. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన నాడు నేడు పథకం నిధుల లేమితో అబాసుపాలవుతున్నది. నాడు నేడులో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన మాటేమో కాని విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. నిధులు కొరతతో ఎక్కడికక్కడే పనులు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల తరగతి గదులు నిర్మాణ సామగ్రితో నిండిపోగా విద్యార్థులకు పాఠాలను ఆరు బయట చెట్ల కింద నిర్వహించాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు. విద్యా సంవత్సరం ముగిసేవరకు పాఠశాలల్లో నాడు నేడు పనులు ఒక కొలిక్కి రాలేదు. మొత్తం మీద నాడు నేడు పనులపై పాలకుల చిత్తశుద్ధి లోపంతో పురోగతి అంతంతమాత్రంగానే ఉన్నా పాలకులు గొప్పగా ప్రకటించుకుంటున్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నాడు నేడు పథకం రెండో విడతలో చేపట్టిన పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. పనులకు నిధులు విడుదల కావడంలేదని పాఠశాలల పేరెంట్స్ కమిటీలు చెబుతున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రెండో విడతలో 3,138 పాఠశాలల్లో రూ.699.28 కోట్లతో పనులు చేపట్టారు. ఈ నిధులు మంజూరు చేసినట్లు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించి విడుదలలో చతికిలపడింది. రూ.348.06 కోట్లు మాత్రమే ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నిధులు సకాలంలో విడుదల కాకపోతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీలు పనులను నిలిపివేశాయి. స్కూల్స్‌లో మౌలిక వసతులు కల్పించక పోవడంతో విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. నిధుల లేమితో పాఠశాలల్లో పనులు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితులు కానరావడంలేదు. నాడు నేడు పేరుతో పలు పాఠశాలల్లో ఉన్న తరగతి గదులను కూల్చివేశారు. నిధుల విడుదలలో జాప్యంతో నూతన గదులు నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోయింది. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు తరగతి గదుల సమస్య నెలకొంది. సొంత డబ్బుతో పనులు చేసేందుకు కమిటీలు ముందుకు రావడంలేదు. పనులు చేసి బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కమిటీ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

నాడు-నేడు-నిర్లక్ష్యం

నాడునేడులో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన మాటేమో కాని విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. నిధులు రాక కొన్ని.. నిర్లక్ష్యంతో కొన్ని దగ్గర్ల పనులు సక్రమంగా సాగడంలేదు. కొన్ని దగ్గర్ల తరగతి గదులు నిర్మాణ సామగ్రితో నిండిపోగా విద్యార్థులకు పాఠాలను రెండు విద్యా సంవత్సరాల్లో ఆరుబయట చెట్ల కింద నిర్వహించాల్సి వచ్చిం దని ఉపాధ్యాయులు వాపోయారు. రెండు విడతల్లో చేపట్టిన పనులు ముందుకు సాగలేదు. పనుల పూర్తిపై అధికారులు నిర్లక్ష్యం వహించారని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలల విలీనంతో తరగతి గదులు చాలక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా గదుల నిర్మాణ పనులను సాగదీస్తున్నారు. పనుల వేగవంతంగా అధికారులు సమీక్షలతో సరిపుచ్చారన్న విమర్శ లున్నాయి.



నరసరావుపేట : ములకలూరులో ఏడాదిగా పునాదులు దశ దాటని తరగతి గది నిర్మాణం

గుంటూరు జిల్లా..

గుంటూరు జిల్లాలో 919 పాఠశాలల్లో రూ.203.94 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. ఇప్పటికి రూ.111.62 కోట్ల పనులు మాత్రమే పూర్తయ్యాయి. 6,523 పనులు చేపట్టగా 2,748 పనులు మాత్రం పురోగతిలో ఉన్నాయి. 2,379 పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. 75 పాఠశాలల్లో 58 ప్యాకేజీల్లో 253 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టగా పది ప్యాకేజీల్లో మాత్రమే గదుల నిర్మాణం పూర్తి చేశారు. 394 పాఠశాలల్లో మరుగుదొడ్ల బ్లాక్ నిర్మాణం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా 237 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. 100 పాఠశాలలకు ప్రహరీ పనులకు 25 పాఠశాలల్లో మాత్రమే పూర్తి చేశారు. 397 విద్యుత్ పనులకు 264 పూర్తయ్యాయి. 745 మరమ్మతుల పనులకు 191 పూర్తి చేశారు.

ఆ నిర్మాణాలపై.. శీతకన్ను



నిర్మాణం నిలిచిపోయిన రేపల్లెలోని మహిళా విద్యార్థుల వసతి భవనం

- అసంపూర్తి నిర్మాణాలు.. అబద్ధాల ప్రకటనలు..!
- టీడీపీ ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాలకు నేటికీ కలగని మోక్షం
- ఐదేళ్లలో పైసా నిధులు విడుదల చేయని వైనం
- ప్రజాప్రయోజనాలు పట్టని వైసీపీ ప్రభుత్వం
- పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన కాపు కల్యాణ మండపం
- ఐదేళ్లు దాటినా పూర్తికాని అద్దంకి వాటర్ ట్యాంక్
- రేపల్లెలోని మహిళల వసతి భవనానిది అదే దుర్గతి
- కొత్తవి లేకపోగా పలు నిర్మాణాలనూ ఆపేసిన వైసీపీ ప్రభుత్వం

అది కాపు కల్యాణ మండపం కావచ్చు, ప్రజల దాహార్తి తీర్చే వాటర్ ట్యాంక్ కావచ్చు, మహిళా వసతి భవనం కావచ్చు, విద్యార్థులకు ఉపయోగపడే క్రీడాప్రాంగణం కావచ్చు.. అన్నింటిదీ ఒక్కటే దారి ఆపేయడం, నిర్మాణాలను శిథిలావస్థకు చేర్చి వికృతానందం పొందడం తప్ప ప్రజాధనం దుర్వినియోగం అవుతుందనే బాధ వైసీపీ పాలకులలో లేదు. నాటి ప్రభుత్వం లో మొదలుపెట్టిన నిర్మాణాలను పట్టించుకోకపోవడం ఒక ఎత్తయితే, టీడీపీ సానుభూతిపరులనే నెపంతో వాటి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లను వేధించడం వైసీపీ అధికార దుర్వినియోగానికి పరాకాష్టగా నిలిచింది.

బాపట్ల, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా ప్రజాప్రయోజనాల విషయంలో పాలకులు పారదర్శకంగా ఉండాలి. కానీ వైపీపీ ఆ నైతిక సూత్రాలకు తిలోదకాలిచ్చింది. టీడీపీ ప్ర భుత్వంలో చేపట్టిన అనేక నిర్మాణాలను పట్టించుకోకపోవడమే కాకుండా అప్పటికే పూర్తయిన వాటి ఆలనాపాలనా కూడా నిర్లక్ష్యం చేసి ప్రజలకు తీరని నష్టం చేకూర్చింది. ఐదేళ్లలో ఒక్క రూపాయి అదనంగా టీడీపీ ప్రభుత్వంలో మొదలెట్టిన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయకపోగా వందల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఒక కొలిక్కి తెచ్చిన నిర్మాణాలపై కూడా శీతకన్ను వేసింది.

రేపల్లెలోని మహిళా విద్యార్థుల వసతి భవనం...

రేపల్లెలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా విద్యార్థుల వసతి కోసం 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం భవనానికి శంకుస్థాపన చేసి శ్లాబ్ వరకు నిర్మాణం చేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం వచ్చిన ఐదేళ్లలో భవన నిర్మాణపనులు పూర్తి చేసిన దాఖలాలు లేవు. మహిళా వసతి భవనం కలగానే మిగిలిపోయింది. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని బల్లికురవ మండలం ముక్తేశ్వరం గ్రామంలో కాపు కల్యాణ మండపం నిర్మాణం కోసం 2018లో టీడీపీ ప్రభుత్వం రూ.15లక్షల నిధులు మంజూరు చేసింది. నిర్మాణం కూడా ప్రారంభించింది. ప్రభుత్వం మారగానే అది కూడా అటకెక్కింది. కాపు కార్పొరేషన్ ద్వారా కల్యాణ మండపానికి రావాల్సిన నిధులకు కూడా మోక్షం లభించలేదు. అద్దంకి ప్రజల దాహార్తి తీర్చడం కోసం టీడీపీ ప్రభుత్వంలో మొదలెట్టిన వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని నేటికి పూర్తి చేయలేదు.

ప్రజా ప్రయోజనాలు గాలికి...

టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన అనేక భవనాల నిర్మాణాల అంచనా విలువ దాదాపు రూ.60 కోట్లకుపైనే ఉంటుంది. వీటిలో సుమారు రూ.40 కోట్ల మేర ఖర్చు చేసి ఒక కొలిక్కి తెచ్చారు. మరో రూ.20 కోట్లు వైసీపీ ప్రభుత్వంలో ఖర్చు చేసి ఉంటే అనేక ప్రయోజనాలు ప్రజలకు దక్కి ఉండేవి. కానీ టీడీపీ నిర్మాణం చేపట్టింది అనే ఒకే ఒక్క దుగ్ధతో వాటిని గాలికొదిలేసిన ఘనత వైసీపీది. మరో వైపు కనీస స్థాయిలో కూడా నిధులు విడుదల చేయలేని అసమర్థత కూడా తోడవడంతో నిర్మాణాలన్నీ అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి

తరగతి గదులూ అసంపూర్తిగానే..

బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో టీడీపీ హయాంలో ప్రారంభించిన తరగతి గదుల భవన సముదాయాల నిర్మాణాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. టీడీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులతో రెండతస్థుల వరకు భవన నిర్మాణం పూర్తయింది. దానికి హంగులద్ది అందుబాటులోకి తేవడంలో అడుగడుగునా వైపీపీ ప్రభు త్వం నిర్లక్ష్యం కనబడింది. బాపట్ల పట్టణంలోని ఉప్పరపాలెంలో టీడీపీ హయాంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకును ప్రజలకు అందుబాటులోకి తేవడంలో ఈ ప్రభుత్వం ఎక్కడలేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడంతో బాపట్ల ప్రజలు తాగునీటి కటకటను ఎదుర్కొంటూనే ఉన్నారు.

క్రీడా ప్రాంగణానికి అదే దుర్గతి

కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి టీడీపీ ప్రభుత్వ హయాంలో పర్చూరులో క్రీడా వికాస కేంద్రాన్ని నిర్మించారు. ప్రభుత్వం మారాక దానిని ముళ్లపొదల నిలయంగా మార్చారు. కొద్దిపాటి పనులు పూర్తి చేసి ఉంటే సకల హంగులతో క్రీడా వికాస కేంద్రం విద్యార్థులకు అందుబాటులోకి వచ్చి ఉండేది. కానీ దానిపైనా కూడా వైసీపీ ప్రభుత్వం కక్ష గట్టినట్లు వ్యవహరించడంతో ఎవరికి పనికిరాకుండా ఆ ప్రాంగణం ఉండిపోయింది. తాజాగా ఎన్నికల ప్రక్రియ శరవేగంగా జరుగుతున్న దశలో ఆ ప్రాంగణం అక్క రకొచ్చింది. దానిని బాగు చేయించి ఎన్నికల సిబ్బంది తమ కార్య కలాపాల నిర్వ హణకు వాడు కోవడం గమనార్హం.



టీడీపీ ప్రభుత్వంలో పర్చూరులో నిర్మించిన క్రీడా వికాస కేంద్రం.. ప్రస్తుతం ఎన్నికల విధులకు వాడుతున్నారు...

ధ్యానబుద్ధ ప్రాజెక్టుపైనా అదే నిర్లక్ష్యం...

భట్టిప్రోలులో టీడీపీ హయాంలో ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేపట్టిన ధ్యానబుద్ధ ప్రాజెక్టు పైనా వైపీపీ ప్రభుత్వం దుర్మార్గంగానే వ్యవ హరించింది. 2016లో దాదాపు రూ.60 లక్షల ను దాని నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం విడుదల చేసింది. ప్రాజెక్టు ఒక కొలిక్కి వస్తుం దనుకున్న దశలో పాలకులు మారడంతో దానికి గ్రహణం పట్టింది. ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లవలసిన ప్రాజెక్టు కాస్తా నేడు మందుబాబులకు అడ్డాగా మారి చూపరులకు ఆవే దన కలిగిస్తోంది. కొల్లూరులో టీడీపీ ఏలు బడిలో ప్రారం భించిన అంగ న్వాడీ భవన నిర్మాణాన్ని ఈ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.



నిర్మాణం నిలిచిపోయిన ధ్యాన బుద్ధ ప్రాజెక్టు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణదేవరాయలు

సాగు నీరు కావాలా.. సారా కావాలా?

● ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలు

బెల్లంకొండ, మే 2: ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు తాగు నీరు కావాలా? సారా కావాలా? అని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలు ప్రశ్నించారు. గురువారం బెల్లంకొండ మండలంలోని గంగిరెడ్డిపాలెం, నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ, న్యూ చిట్యాల, చంద్రాజుపాలెం, కందిపాడు, పాపాయపాలెం గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి పెదకూరపాడు ఉమ్మడి అభ్యర్థి బాష్యం ప్రవీణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపిస్తే రాష్ట్రంలో ఉన్న రైతులందరికీ నీరు అందుతుందని, వైసీపీకి ఓటు వేస్తే సారా తయారవుతుందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కావాలన్నా, పరిశ్రమలు రావాలన్నా నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాలని ఆయన సూచించారు. బెల్లంకొండ గ్రామంలో అన్ని సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి గ్రామంలో షాదీఖానా నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. అలాగే బేడ బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని బుడగ జంగాల పెద్దలు కోరారు. అధికారంలోకి రాగానే ఆయా సమస్యల పరిష్కారినికి కృషిచేస్తామన్నారు. పెదకూరపాడు టీడీపీ అభ్యర్థి బాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ అన్నివర్గాలు అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించాలని సూచించారు. వైసీపీని తరిమి కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, సర్పంచ్ జ్యోతి సముద్రం, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, గుంజా గంగారావు, నాగమణి బాయి, రమాదేవి, వీరాంజనేయులు, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

పెమ్మసాని సవాల్‌ని స్వీకరించే దమ్ముందా ?

● టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు,మే 2(ఆంధ్రజ్యోతి): జగన్ రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే ఆస్తుల సంపాదనపై గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విసిరిన సవాల్‌ను స్వీకరించాలని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. గురువారం గుంటూరులోని డాక్టర్ పెమ్మసాని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డబ్బు కోసం, పదవుల కోసం హత్యలు చేయటం.. చేయించటం వైఎస్ కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్యని అన్నారు. జగన్ నీలి మీడియాలో పెమ్మసానిపై తప్పుడు కథనాలు ప్రసారం చేయటంపై తీవ్రంగా మండిపడ్డారు. తాత రౌడీషీటర్, తండ్రి ఫ్యాక్షనిస్టు, ఆయన ఆర్థిక నేరస్తుడు.. స్థూలంగా వైఎస్ కుటుంబ చరిత్ర ఇదని దుయ్యబట్టారు. పెమ్మసాని, వైఎస్ కుటుంబం ఆర్థికంగా ఎది గిన తీరుపై వైసీపీ నేతలకు దమ్ముంటే బహిరంగచర్చకు రావాలని సవాల్ విసిరారు. పెమ్మసాని మాటల తూటాలకు తాడేపల్లి ప్యాలెస్ కంపించిపోతుం దన్నారు. పదవ తరగతి పేపర్ లీకేజ్ కేసులో జైలుపాలైన జగన్‌కు, ఎంసెట్ మెడికల్ విభాగంలో 26వ ర్యాంక్ సాధించిన పెమ్మసానికి పోలికేంటని ప్రశ్నించారు. జగన్‌రెడ్డి డిగ్రీ ఎక్కడ చదివాడో ఈ రోజుకు కూడా సమాధానం లేని ప్రశ్నగానే మిగిలిపోయిందని ఎద్దేవాచేశారు. తినటానికి తిండిలేక బలపనూరు నుంచి పులివెందులకు వలస పోయిన నీ కుటుంబ చరిత్ర కడప జిల్లా ప్రజలకు తెలియంది కాదన్నారు. నీ తాత రాజారెడ్డిని పులివెందుల నడిరోడ్డులో ఎందుకు హత్య చేశారో, నీ తండ్రి రాజశేఖరరెడ్డిపై హైదరాబాద్ సచివాలయంలో కాల్పులు ఎందుకు జరిగాయో సమాధానం చెప్పాలని జగన్‌ను కనపర్తి డిమాండ్ చేశారు. వైఎస్ కుటుంబ రక్త చరిత్ర దేశ ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అడకా శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

భావితరాల కోసం ఓటు వేయండి

● డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

● కూటమి పార్టీల శ్రేణులతో ఆత్మీయ సమావేశం



కొలకలూరులో ప్రసంగిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్

తెనాలి రూరల్, మే1: కులాలు, మతాలు, వర్గాలు అంటూ ప్రజల్లో విభేదాలు పెట్టి అధికారంకోసం పోరుకులాడే వైసీపీ రాజకీయాలు మనకు వద్దని రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకోసం, భావితరాల కోసం పాటుపడే చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నరేంద్ర మోదీల కూటమికి ఓటు వేయాలని గుంటూరు పార్లమెంటరీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

గురువారం మండలంలోని నందివెలుగులో ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులతో పెమ్మసాని చంద్రశేఖర్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ ఈ ప్రాంతం వాడినేనని చెప్పుకొనే కిలారి రోశయ్య.. జగన్ మోహన్‌రెడ్డి మూడు రాజధానులంటే దానిని ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. రాజధాని అమరావతిగా అభివృద్ధి చెంది ఉంటే గుంటూరు ప్రాంతం ఇప్పటికే అనేక రంగాల్లో అగ్రగామిగా నిలిచేదన్నారు. కనీసం ఐదేళ్ళలో రోడ్లు కూడా వేయలేని అసమర్థపు ప్రభుత్వం వైసీపీ కాదా అని సూటిగా ప్రశ్నించారు. కిలారి రోశయ్యపై తనకు ఎటువంటి వ్యక్తిగత విభేదాలు లేవని కేవలం రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని జీర్ణించుకోలేకే మాట్లాడానన్నారు. కులాలు మతాల మధ్య చిచ్చుపెట్టడం ద్వారా ప్రాంతాలు అభివృద్ధి చెందకపోగా ప్రజల్లో సోదరభావం పోయి విద్వేశాలు పెరుగుతాయన్నారు. వైసీపీ పాలనలో వర్గాల పోరు తప్ప ప్రజలకు రాష్ట్రానికి చేసే మంచి ఒక్కటైనా చేయలేకపోయారని విమర్శించారు. ఉమ్మడి పార్టీల ఆలోచన ఒక్కటే నన్నారు. అంధకారంలో ఉన్న రాష్ట్రాన్ని తిరిగి వెలుగులు నింపుకోవాలని, కార్మికులకు ఉపాధి కల్పించాలని, రైతుల ఇంట ధాన్యపు సిరులు నింపాలని, నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలతో సంతోషాలు నింపాలని అని అన్నారు. అదే విధంగా నైపుణ్య శిక్షణాతరగతుల ద్వారా యువతలో స్వశక్తితో బతకగలమనే నమ్మకాన్ని పెంచాలని, మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా వారితో చిన్నపరిశ్రమలు పెట్టించి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రణాళికతో ముందుకు నడపాలని, పూరి గుడిసెల్లో ఉన్న పేదలకు మంచి ఇల్లు కట్టించి వారిలో సంతోషాన్ని చూడాలని ఇలా అన్ని రకాలుగా ప్రజలందరికీ ఉపయోగపడే పనులు చేయాలన్న లక్ష్యంతో ఎన్నికల బరిలో మీ ముందుకు వచ్చామన్నారు. తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్ ఈ ప్రాంతంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి మీ అభిమానం పొందారన్నారు. ఈ ఎన్నికల్లో ఆయనను తిరిగి గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు. ఎంపీ అభ్యర్థిగా ఉన్న తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. నందివెలుగులో ఉన్న హైస్కూల్ నిర్మాణపనులు, డొంకరోడ్లు వంటివాటిని అధికారంలోకి వచ్చిన తరువాత బడ్జెట్‌ను బట్టి ఆరునెలలు లేదా సంవత్సరంలో పనులు ప్రారంభించేలా చూస్తామన్నారు. ప్రజలందరూ ఈ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుని భావితరాల భవిష్యత్తును కాపాడాలని పెమ్మసాని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ బకాయిలు జమ చేస్తాం

● చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు

● సంక్షేమ కార్యక్రమాలు ఏ ఒక్కటి ఆగవు : లావు రత్తయ్య



తుర్లపాడులో జరిగిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ప్రత్తిపాటి

యడ్లపాడు, మే 2 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడగానే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన రెండు విడతల రైతు రుణమాఫీ బకాయిలు మొత్తాన్ని ఆయా రైతుల ఖాతాల్లో జమచేస్తామని, ఈ విషయంలో పార్టీ అధినేత స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారని చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బుధవారం రాత్రి యడ్లపాడు మండలంలోని సందెపూడి, తుర్లపాడు, గణేశునివారిపాలెం గ్రామాలలో సినీ నటుడు శివాజీ, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్యలతో కలసి ప్రత్తిపాటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారానికి వచ్చిన నాయకులకు మహిళలు, రైతులు, యువకులు, పార్టీ అభిమానుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. ప్రచార రథంపై రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ కూటమి మేనిఫేస్టో చూశాక వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయన్నారు. 50 ఏళ్ళు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రూ.4వేలు పింఛన్, ఇంట్లో ఎంతమంది చదువుకుంటే అంతమందికి ఏడాదికి రూ.15వేలు హామీ ఎంతో సాహసోపేతమైనవిగా అభివర్ణించారు. ఆడబిడ్డలకు ఉచితంగా బస్సు సౌకర్యంతో పాటు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించి తీరతామన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి, అన్నదాతలకు ఏడాదికి రూ.20వేలు ఆర్థికసాయం అందిస్తామన్నారు. లావు రత్తయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సంక్షేమ కార్యక్రమాలు ఒక్కటి కూడా ఆగవని, ఇంకా మెరుగ్గా ఉంటాయని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే పిల్లలకు మంచి చదువులు చదివించేందుకు వీలవుతుందన్నారు. రైతుల భూములు, పత్రాలు వారి స్వాధీన హక్కుభుక్తంలో ఉండాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు. సినీ నటుడు శివాజీ మాట్లాడుతూ బీసీ మహిళను అని చెప్పుకుంటూ మా బీసీలను విడదల రజిని వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. ఎంతో నమ్మకంతో గెలిపిస్తే చరిత్రలో మర్చిపోలేని విధంగా మా బీసీలకు అన్యాయం చేసిందన్నారు. బీసీలపైనే అక్రమ కేసులు పెట్టించిందని, నమ్మక ద్రోహానికి రజిని కేరాఫ్ అన్నారు. గత ఐదేళ్ళలో రజిని చేసిన అక్రమాలపై పెద్దఎత్తున ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి జయరామిరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు కామినేని సాయిబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



రెంటచింతలలో ఎండ.. చురచుర

● 47 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

రెంటచింతల, మే 2: సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. రోహిణికి ముందే రోళ్లు పగిలే ఎండలు కాస్తున్నాయి. రెంటచింతలలో గురువారం అత్యధిక పగటి ఉష్ణోగ్రత 47 డిగ్రీలుగా నమోదైంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో రెంటచింతల అత్యధిక ఉష్ణోగ్రతకు పేరు గాంచిన ప్రాంతం. ఇక్కడ ఎక్కువగా వందలాది ఎకరాల్లో నాపరాయి క్వారీలుండడమే వేడికి కారణం. వృద్ధులు, చిన్నపిల్లలు, వ్యాధిగ్రస్తులు, వేడిని భరించలేక అవస్థ పడుతున్నారు. రాత్రి 9 గంటలైనా వేడి గాలులు వీస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడం వలన ఎండలు ఎక్కువగా ఉంటున్నాయి.



టీడీపీలో చేరిన వైసీపీ జడ్పీటీసీ శిరిగిరి గోపాళరావుతో కన్నా

సైకిలెక్కిన వైసీపీ జడ్పీటీసీ శిరిగిరి

ముప్పాళ్ళ మే 2: వైసీపీ జడ్పీటీసీ శిరిగిరి చంద్రకళ మరిది శిరిగిరి గోపాళరావు గురువారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. సత్తెనపల్లి కన్నా కార్యాలయంలో శిరిగిరి గోపాళరావుకు కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు గెలుపునకు కృషిచేస్తానని గోపాళరావ అన్నారు. శిరిగిరి గోపాళరావుకు సన్నిహితులు, అనుచరులు, ప్రజాప్రతినిధులు త్వరలో టీడీపీలో చేరనున్నట్లు సమాచారం.

వైసీపీకి అమరావతి ఎంపీపీ రాజీనామా

అమరావతి, మే2: రాష్ట్ర పంచాయితీరాజ్ వింగ్ మాజీ అధ్యక్షుడు, అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు తన అనుచరులతో కలసి వైసీపీకి గుడ్‌బై చెప్పారు. బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన హనుమంతరావు తన రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షులు జగన్మోహనరెడ్డికి పంపిస్తున్నట్లు తెలిపారు. గురువారం హనుమంతరావు ఇంటి వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తన పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎంఎల్ఏ నంబూరు శంకరరావు 18నెలలుగా తన ఎదుగుదలను ఓర్చుకోలేక అణచివేత ధోరణి వ్యవహరించారని పార్టీ కార్యాక్రమాలకు పిలవకుండా అవమాన పర్చారన్నారు. ఈవిషయమై పార్టీ నాయకత్వానికి తెలిపినా పట్టించుకోలేదని అన్నారు. అనిల్‌యాదవ్ కూడా ఎమ్మెల్యే మాటలు విని తనపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. రానున్న ఎన్నికల్లో శంకరరావు, అనిల్‌కుమార్ యాదవ్‌ను ఓడించే విధంగా పల్నాడు జిల్లా పరిధిలో పనిచేస్తానని అన్నారు.



మద్యంతో పట్టుబడిన వైసీపీ సర్పంచ్ రామారావుతో సెబ్ అధికారులు

మద్యం తరలిస్తూ పట్టుబడ్డ వైసీపీ సర్పంచ్

● ఆకస్మిక తనిఖీతో బార్ సీజ్, కేసు నమోదు

● 1056 మద్యం బాటిల్స్ స్వాధీనం

పిడుగురాళ్ల, మే2: అక్రమంగా మద్యం తరలిస్తున్న వైసీపీ సర్పంచ్‌ని పల్నాడు జిల్లా ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు గురువారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకున్నారు. కొండమోడు వద్ద గల పల్నాడు బార్ అండ్ రెస్టారెంట్ నుంచి 1056 మద్యం బాటిల్స్‌ను పిడుగురాళ్ల మండలం వీరాపురం గ్రామ వైసీపీ సర్పంచ్ సుంకర విజయరామారావుకు చెందిన వాహనంలో మరో వ్యక్తితో కలిసి వాహనంలో లోడ్ చేస్తుండగా ఫ్లైయింగ్ స్క్వాడ్, పల్నాడు జిల్లా ఎన్నికల అధికారి, ట్రైనీ ఐపీఎస్ కల్పశ్రీ సిబ్బందితో దాడి చేసి మద్యం సీసాలు, వైసీపీ ప్రచార కరపత్రాలు కలిగివున్న వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.2 లక్షల వరకు వుంటుందని కల్పశ్రీ తెలిపారు. పల్నాడు బార్ అండ్ రెస్టారెంట్‌పై కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు తెలిపారు. సర్పంచ్ విజయరామారావు, కేశానుపల్లి గ్రామస్థుడు గణేష్‌బాబుపై కేసు నమోదు చేసినట్లు సెబ్‌సీఐ సూర్యనారాయణ తెలిపారు.

11 నుంచి జూన్ 9 వరకు

మిర్చియార్డుకు వేసవి సెలవులు

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు)కు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ వేసవి సెలవుదినాలను ప్రకటించింది. ఎండల తీవ్రత పెరగడంతో మిర్చియార్డులో పనులుచేయడం కార్మికులకు కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో వివిధ యూనియన్ల విజ్ఞప్తి మేరకు ప్రతీ సంవత్సరం వలే ఈ నెల 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు వేసవి సెలవుదినాలను మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు ప్రకటించారు. దీని దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఈ నెల 10వ తేదీ రాత్రి వరకే యార్డుకు సరుకు విక్రయానికి తెచ్చుకోవాలన్నారు. సెలవుదినాల అనంతరం జూన్ 10న యార్డు పునఃప్రారంభమౌతుందన్నారు. దీని దృష్ట్యా జూన్ 9వ తేదీ రాత్రి నుంచి యార్డులోకి సరుకు అనుమతిస్తామన్నారు. మిర్చి లావాదేవీలకు మాత్రమే సెలవులని, యార్డులో అధికారిక కార్యకలాపాలు యథాతథంగా కొనసాగుతాయన్నారు.

రాజధాని లేకుండా రాష్ట్ర ప్రగతి ఎలా జగన్ ?

● 1598వ రోజుకు రైతుల ఆందోళనలు



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, మే 2: రాజధాని లేకుండా రాష్ట్రాభివృద్ధిని ఎలా సాధిస్తావు జగన్‌రెడ్డి అని అమరావతి రాజధానికి భూములు త్యాగం చేసిన రైతులు ప్రశ్నించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుండి చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు గురువారం నాటికి 1598వ రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా రైతు ధర్నాశిబిరాల నుండి పలువురు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రగతికి కేంద్ర బిందువైన రాజధాని అమరావతిని విచ్ఛిన్నం చేసిన వైసీపీని ఓడించి జగన్‌కు బుద్ధిచెప్పాలని ప్రజలను కోరారు. అదే సందర్భంలో విజనరీ లీడర్ నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర ప్రజల కలలు సాకారమవుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలందరిపై ఉందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని గ్రామాల్లో నిరసనలు కొనసాగాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	142, 151, 162
చికెన్ విత్ స్కిన్	274.00
చికెన్ స్కిన్ లెస్	284.00



మాట్లాడుతున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

కిలారిని మించిన మాఫియా డాన్ మురళి

● సత్తెనపల్లిలో జనసైనికులపై వేధింపులు

● అంబటి రాంబాబు షాడో ఎమ్మెల్యేగా మురళీ..

● పొన్నూరు కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ధ్వజం

పొన్నూరుటౌన్,మే2: ఎమ్మెల్యే కిలారిని మించిన మైనింగ్ మాఫియా డాన్ అంబటి మురళీకృష్ణ అని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ధ్వజమెత్తారు. గురువారం చింతలపూడి డీవీసీ కల్యాణమండపంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. సత్తెనపల్లిలో అంబటి మురళీ చేసిన అరాచకాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సత్తెనపల్లిలో అంబటి రాంబాబు షాడో ఎమ్మెల్యేగా మురళీ వ్యవహరించారని దుయ్యబట్టారు. ఆయన కన్నుపడిన గుట్టలు, కొండలు కనుమరుగైపోయాయని అన్నారు. నకరికల్లు మండలం, త్రిపురాపురం, గుండ్లపల్లి కొండలను ఇష్టారాజ్యంగా తవ్వి ఎర్రమట్టి గ్రావెల్‌ను దోచుకున్నారని ఆరోపించారు. పొన్నూరు నియోజకవర్గంలో చేబ్రోలు మండలంలో ఎమ్మెల్యే కిలారి రోశయ్య ఏస్థాయిలో గ్రావెల్ మాఫియాను నడిపించాడో సత్తెనపల్లిలో అంబటి మురళీ అంతకు మించి మాఫియాను నడిపారన్నారు. పొన్నూరు వచ్చి జనసైనికులను ఉద్ధరించినట్లు మాట్లాడుతున్న మురళీ సత్తెనపల్లిలో ఉన్న మూడేళ్ల కాలంలో జనసైనికులపై చేసిన దాడులు అరాచకాలు అడ్డుఅదుపు లేవన్నారు. అలాగే ఒక ప్రముఖ మీడియాలో కుటుంబాలను అంబటి కూల్చి కాపురాలను విచ్ఛిన్నం చేసిన కథనం సంచలనంగా మారిందన్నారు. అంబటి మురళీకృష్ణ సత్తెనపల్లి నుంచి ఎందుకు బయటకు వచ్చాడో చెప్పే దమ్ము ధైర్యం ఉందా అని నిలదీశారు. మురళీలోలుడు అయితే చాలు, మురళీని ప్రసన్నం చేసుకుంటే చాలు ఏమైనా చేయవచ్చు అంటూ వచ్చిన కథనాలు అనేకం ఉన్నాయని గుర్తుచేశారు. అధికారం ఉపయోగించి ఇంటర్నెట్‌లో కథనాలు తొలగించిన చరిత్రను మార్చలేరన్నారు. ఈ అంబటి మురళీ నిజస్వరూపాన్ని గుర్తించి పొన్నూరు ప్రజలు కూటమి అభ్యర్థులను గెలిపించాలని నరేంద్ర కుమార్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏషియన్ పోటీలకు ముగ్గురు లిఫ్టర్లు

మంగళగిరి సిటీ, మే 2: హాంకాంగ్‌లో ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు జరిగే ఏషియన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్, ఏషియన్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొనే భారత జట్టుకు గుంటూరు జిల్లా మంగళగిరి ఫిట్ జోన్‌లో శిక్షణ పొందుతున్న ముగ్గురు లిఫ్టర్లు ఎంపికైనట్టు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. తెనాలికి చెందిన షేక్ షబీనా ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో 84 కిలోల జూనియర్స్ విభాగానికి, ఏషియన్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీలకు మంగళగిరికి చెందిన పి.భరత్ కుమార్ (కృష్ణా యూనివర్సిటీ) 59 కిలోల విభాగానికి, మంగళగిరికి చెందిన షేక్ ఆసియా (వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం) 69 కిలోల విభాగంలో పోటీ పడేందుకు ఎంపికయ్యారని చెప్పారు. భరత్‌కు విజయవాడ కేబీఎన్ కళాశాల, షబీనాకు తాడేపల్లి నులకపేటకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థలు ఆర్థిక సహకారం అందించారని పేర్కొన్నారు. ఎంపికైన పవర్ లిఫ్టర్లను పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

నగదు, జెండాలు సీజ్

గుంటూరు(తూర్పు), మే 2: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో గురువారం ఫ్లయింగ్ స్క్వాడ్‌లు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా తాడికొండ నియోజకవర్గంలో రూ.2,23,660 నగదు, గుంటూరు తూర్పులో రూ.60,500 విలువైన 12వేల జెండాలు,టవల్స్ సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీలలో మే 2వ తేది సాయంత్రం 6 గంటల వరకు రూ.2,75,43,087 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వహించాలి : ఎస్పీ



ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, మే 2 : జిల్లా పోలీసు శాఖను సమన్వయం చేసుకొని ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా, నిబద్ధతతో నిర్వహించాలని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం జిల్లాకు వచ్చిన సాయుధ బలగాల అధికారులతో ఎస్పీ సమావేశమయ్యారు. ప్రస్తుతం జిల్లాలోని పరిస్థితులు, ఎన్నికల సమయంలో నిర్వహించాల్సిన విధులు గురించి దిశ, నిర్దేశం చేశారు. సమస్యాత్మక గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించి ప్రజలకు పోలీసుశాఖ అండగా ఉందనే భరోసా కల్పించాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయటానికి నగదు, మద్యం, ఇతర వస్తువులు వినియోగించే అవకాశం ఉంది. కావున వాటి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా పోలీసులతో సమన్వయం చేసుకుంటూ వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈవీఎం, వివిప్యాట్స్ భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసుకొని 24 గంటల పాటు అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఆర్కే భారతి, జిడి సంజయ్, తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీసు అసిస్టెంట్ కమాండెంట్‌లు టి.కాశీదాసు, సీతారాం, ఎం.శ్రీనివాసరావు, ఏఆర్‌డీఎస్పీ ఎస్.చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

● శ్మశానవాటికకు వెళ్ళే డొంక చదును చేసి మెరకలు



ఐలవరం వద్ద డొంకను చదును చేసి మెరక తోలుతున్న చిత్రం

భట్టిప్రోలు, మే 2: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ అధికార పార్టీ అండదండలతో స్థానిక నాయకులు శ్మశాన వాటిక పనులు చేపట్టారు. మండలంలోని ఐలవరం గ్రామంలో హిందూ శ్మశానానికి ప్రభుత్వం స్థలం కేటాయించడం జరిగింది. ఏళ్లు గడుస్తున్నప్పటికీ అటు వైపు కన్నెత్తి చూడని అధికార పార్టీ నాయకులు ఎన్నికల సమయంలో హడావిడిగా శ్మశానం అభివృద్ధి పనులకు పూనుకున్నారు. గత రెండు రోజులుగా శ్మశాన వాటికకు వెళ్ళేందుకు అనువుగా డొంకను చదును చేస్తూ మెరకలు తోలుతున్నారు. అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ మల్లికార్జునరావును వివరణ కోరగా ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకూడదని ఐలవరంలో జరుగుతున్న పనులు గురించి దృష్టికి రాలేదన్నారు.

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోవర్ధనరెడ్డికి సన్మానం



చీరాల గోవర్ధనరెడ్డిని సన్మానిస్తున్న ప్రముఖులు, నాయకులు

బాపట్ల, మే 2 : మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించబడిన చీరాల గోవర్ధనరెడ్డిని గురువారం పలువురు నాయకులు, ప్రముఖులు కలిసి సన్మానించారు. ప్రజాసేవకుడిగా ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆయనకు సముచిత స్థానం కల్పించటం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు తోట నారాయణరావు, సీనియర్ న్యాయవాది కళ్ళం హరినాధరెడ్డి, చార్టెర్డ్ అకౌంటెంట్ చాపల సుబ్రహ్మణ్యం, టీడీపీ లీగల్ సెల్ నాయకులు భీమా లీలాకృష్ణ, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పమిడి భాస్కరరావు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ దగ్గుమల్లి ధర్మారావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పమిడి రవీంద్ర, ఎస్సీ సెల్ నాయకులు కూచిపూడి శ్యామ్ సుందర్, గవిని హరిబాబు, చింతా దేవసహాయం, శంకరరెడ్డి పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

బాపట్ల, మే 2 : కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేసినట్లు టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ తెలిపారు. కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వేగేశన నరేంద్రవర్మ, తెన్నేటి కృష్ణ ప్రసాద్ విజయం కోరుతూ గురువారం ఈతేరు గ్రామపంచాయతీ పరిధిలో ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బి.వెంకటేశ్వర్లు, రవిచందు, పాల్, వెంకటేశ్వర్లు, కట్టా చిన్న, సునీత, బి.నాగేష్, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

బాపట్లటౌన్, మే 2 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అన్నివిధాలుగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. యూటీఎఫ్ వ్యవస్థాపకుడు డి.రామిరెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా గురువారం బాపట్లలోని కల్యాణమండపంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ అభివృద్ధికి రామిరెడ్డి చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల భూముల రిజిస్ట్రేషన్ పత్రాలపై జగన్‌బొమ్మలు దారుణం : కొల్లా

బాపట్లటౌన్, మే 2 : రైతుల భూముల రిజిస్ట్రేషన్ పత్రాలపై జగన్ బొమ్మలు దారుణమని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను అడ్డుపెట్టుకొని జగన్ రైతుల భూములను కాజేయటానికి ఈ యాక్ట్‌ను అమలు చేశారన్నారు. రాబోవు రోజుల్లో టీడీపీ అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తామని చంద్రబాబు ప్రకటించటం హర్షణీయమన్నారు.

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి : డీఎస్పీ

రేపల్లె, మే 2: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కు స్వేచ్ఛ గా వినియోగించుకోవాలని డీఎస్పీ మురళీకృష్ణ అన్నారు. ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ సమయంలో అరాచక శక్తులు ఎవరైన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఉపేక్షించే ది లేదన్నారు. నియోకజకవర్గం పరిధిలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంత వాతారణంలో నిర్వహించేందుకుచర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్ళ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశ, రాష్ట్రాభివృద్ధి : జేడీ శీలం

రేపల్లె, మే 2: దేశ, రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యమని మోదీ అహంకార ప్రభుత్వానికి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కేంద్రమాజీ మంత్రి, బాపట్ల పార్లమెంటరీ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి జేడీ శీలం అన్నారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోవిలేకర్ల సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో బాపట్ల ఎంపీ అభ్యర్థిగా నాకు, రేపల్లె నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా మోపిదేవి శ్రీనివాసరావుకు ప్రజలంతా అండగా ఉండి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ గోపీనాథ్, సీపీఐ నాయకులు గొట్టుముక్కల బాలాజీ, పి.నాగాంజనేయులు, సీపీఎం నాయకులు సీహెచ్ మణిలాల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన వైసీపీ కుటుంబాలు

బాపట్ల, మే 2 : మండలంలోని బేతపూడి గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు వైసీపీని వీడి గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పటేల్‌నగర్‌లో జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గంటా అంజిబాబు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు దేవరాజు, పి.శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని మండలం కర్లపాలెం : అంజిబాబు

కర్లపాలెం, మే2 : బాపట్ల నియోజకవర్గంలో అభివృద్ధికి నోచుకోని మండలాలు ఉన్నాయని వాటి గురించి ప్రస్తుత ప్రభుత్వానికి కాని, బాపట్ల పాలకులు కాని పట్టించుకునే దాఖలాలు లేవని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గంటా అంజిబాబు అన్నారు. కర్లపాలెంలో కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు, అభిమానులతో అంజిబాబు గురువారం తోట వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోట వెంకటేశ్వరరావు, గోపిరెడ్డి, సీపీఐనాయకులు జెల్డి భాగ్యశ్రీధర్, దోనేపూడి దేవరాజు, రవి, నవీన్, శంకర్‌రెడ్డి, పట్టాభి, మనోహర్, ఎస్‌వీఆర్‌కుమార్ తదితర కాంగ్రెస్‌నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి : గోపినాథ్

బాపట్ల, మే2 : ప్రజాస్వామిక మేనిఫెస్టో ప్రకటించిన కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని భారత్ బచావో జాతీయ వైస్ ఛైర్మన్ ఎం.ఎస్.ఎఫ్ గోపినాథ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గంటా అంజిబాబుతో కలిసి గురువారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో గంటా అంజిబాబు, చిగురుపాటి భాస్కరరావు, గూడూరి సీతామహాలక్ష్మీ, గద్దె రత్నశ్రీ, దేవరాజు, శంకర్‌రెడ్డి, తాడికొండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి గుండ్రెడ్డి శివ రూ.5.20 లక్షల విరాళం

బాపట్ల, మే 2 : పట్టణంలోని కాకుమానువారిపాలెంలో ఉన్న శ్రీ కోదండ రామాలయానికి జి.ఎస్.ఆర్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత గుండ్రెడ్డి శివ 5 లక్షల 20 వేల రూపాయల విరాళాన్ని అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేయగా కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో ఎ.శ్రీనివాసరావు, ఎనాగేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కూటమితో ప్రతి కుటుంబానికి మేలు

● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన

● గ్రామ గ్రామాన నరేంద్రవర్మకు ఘనస్వాగతం



మిరపతోటలో కూలీలతో మాట్లాడుతున్న వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మే 2 : కూటమి అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి మేలు జరిగే విధంగా అనేక సంక్షేమ ఫలాలు అందించటం జరుగుతుందని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన పార్టీశ్రేణులతో కలిసి హైదర్‌పేట, సత్యవతిపేట, తూర్పుపిన్నిబోయన వారిపాలెం గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. గ్రామగ్రామాన నరేంద్రవర్మకు ప్రజలు బ్రహ్మరథంపట్టారు. మహిళలు హారతులిచ్చి విజయతిలకం దిద్దారు. ఆటో కార్మికులంతా కలిసి రావటంతో వారితో మాట్లాడి అధికారంలోకి రాగానే ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. మిరపతోటలో కాయలు కోస్తున్న కూలీలను కలిసి మద్దతు కోరారు. ఆయా గ్రామాల ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం, వీధిలైట్ల ఏర్పాటు, సాగునీటి కాల్వల మరమ్మతులు, డ్రైనేజిల ప్రక్షాళన వంటివి చేపడతామని హామి నిచ్చారు. నిరుద్యోగయువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన విషయంలో ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్ పథకాలను కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తెన్నేటి కృష్ణప్రసాద్‌లను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, నాయకులు పిట్ల వసంతరెడ్డి, శ్రీకృష్ణ, మరీదు వెంకటేశ్వరరావు, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, కూచిపూడి ఝాన్సీరాణి, దగ్గుమల్లి రాణి, షేక్ నజ్మా, ఉమారెడ్డి వెంకటేష్, విష్ణుమొలకల చంద్రమోహన్, ముక్కాముల సాంబశివరావు, చెన్నుపాటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తా

కర్లపాలెం, మే 2 : బాపట్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో తాగు, సాగునీరు వీధి దీపాలు ఏర్పాటు, పంట కాల్వల నిర్వహణ, మురుగుకాల్వల ప్రక్షాళన, నాణ్యవంతమైన రహదార్లు ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తానని బాపట్ల నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని శీలంవారిపాలెం, సమ్మెటవారిపాలెం, పొరుగున ఉన్న కప్పలవారిపాలెం, పేరలి గ్రామాలలో నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ భార్య శిరీష, జనసేన నాయకుడు నామన వెంకటశివన్నారాయణ, పార్టీశ్రేణులతో కలిసి గురువారం ముమ్మర ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నరేంద్రవర్మకు యువకులు, మహిళలు, పూలజల్లులతో ఘనస్వాగతాలు పలికి హారతులిస్తూ నరేంద్రవర్మకు విజయతిలకం దిద్దారు. వందలాది మంది యువకులు ద్విచక్రవాహనాలతో టీడీపీ జెండాలు చేతబూని నరేంద్రవర్మ వెంట భారీ ర్యాలీతో మద్దతు పలికారు. మహాశక్తి, నిరుద్యోగ యువతకు, ఉద్యోగ ఉపాధి కల్పన విషయంలో ప్రత్యేక దృష్టిసారిస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చీరాల గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన మైనార్టీ వర్గాల జీవితాలు బాగు పడాలంటే చంద్రబాబునాయుడు సారధ్యంలో ఏర్పడిన సంకీర్ణ కూటమి వల్ల సాధ్యమౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేననాయకులు శివన్నారాయణ, గొట్టిపాటి శ్రీకృష్ణ, చిలకల సురేంద్రబాబు, ఎండీ మొహిద్దీన్‌బేగ్, నక్కల వెంకటస్వామి, మాజీ సర్పంచ్ సమ్మెట ఏడుకొండలురెడ్డి, పలువురు మండలంలోని టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్లను ఓట్లు అడుగుతున్న వేగేశన నరేంద్రవర్మ



సమ్మెటవారిపాలెంలో ప్రజలకు అభివాదం చేస్తున్న నరేంద్రవర్మ, ఎంపీ అభ్యర్థి భార్య శిరీష తదితరులు

కులాల మధ్య చిచ్చు పెడుతున్న వైసీపీ

● అప్రమత్తంగా ఉండాలని సూచించిన ఆనందబాబు

● కొల్లూరు కరకట్ట నుంచి వీర మహిళలు ఘన స్వాగతం



పెసర్లంకలో చంటి బిడ్డను ఎత్తుకున్న ఆనందబాబు

కొల్లూరు, మే 2 : కులాల మధ్య చిచ్చుపెట్టి వైసీపీ ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తుందని కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు విమర్శించారు. గురువారం మండలపరిధిలోని పెసర్లంక, ఆవులవారిపాలెం, క్రీస్తులంక, గాజుల్లంక గ్రామాల్లో కూటమి అభ్యర్థి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొల్లూరు కరకట్ట నుంచి ఆయనను వీరమహిళలు, జనసైనికులు ర్యాలీగా పెసర్లంక గ్రామానికి తోడ్కొని వెళ్లారు. అడుగడుగునా మహిళలు ఆయనకు బ్రహ్మరథం పట్టి ఘన స్వాగతం పలికారు. జనసేన ప్రభావిత గ్రామాల్లో ఆనందబాబుకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. ఆవులవారిపాలెం గ్రామంలో జనసైనికులు ఆనందబాబును గజమాలతో సత్కరించారు. రోడ్‌షో ద్వారా లంక గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, ఒక్కఛాన్స్ పేరిట పాదయాత్ర చేసి 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ఈ ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాలను మోసం చేశాడన్నారు. ఆయా వర్గాలంతా ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పదే పదే సంక్షేమం పేరుతో పబ్బం గడుపుకుంటున్నారని, సంక్షేమ పథకాలు టీడీపీ ప్రభుత్వంతోనే ప్రారంభమయ్యాయని కొత్తగా వైసీపీ చేసిందేమీ లేదన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి మ్యానిఫెస్టోలో ఇంతకు మించిన సంక్షేమ పథకాలు రూపొందించామని అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వాటిని అమలు చేస్తామన్నారు. కాపు సంక్షేమం కోసం సంవత్సరానికి రూ.3 వేల కోట్ల నిధులతో ప్రత్యేక లబ్ది చేకూర్చేందుకు కూడా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రణాళిక రూపొందించారన్నారు. మత్స్యకారులకు చేపల వేట నిషేధ సమయంలో రూ.20 వేలు అందించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో అన్ని చోట్లా రహదారులన్ని అధ్వాన స్థితికి చేరుకున్నాయని, ఐదేళ్లలో వాటి గురించి పట్టించుకోలేదన్నారు. జగన్ కబంధ హస్తాల నుంచి రాష్ట్రాన్ని విడిపించి మళ్లీ అన్ని వ్యవస్థలను గాడిలో పెట్టాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఐదేళ్లలో చూసిన అవినీతి, అక్రమాలను గుర్తుంచుకుని విజ్ఞతతో మే 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ, జనసేన బలపరిచిన అసెంబ్లీ అభ్యర్థిగా తనకు, పార్లమెంట్ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయా ప్రచార కార్యక్రమాల్లో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, జొన్నలగడ్డ విజయబాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బొందలపాటి చలమయ్య, జనసేన ప్రజా ప్రతినిధులు వెలివెల బసవరత్తయ్య, సుబ్రహ్మణ్యం, సమ్మెట దుర్గాప్రసాద్, టీడీపీ నాయకులు యలవర్తి కోటేశ్వరరావు, జీఎల్‌జీ భగవాన్, సుంకర రాంబాబు, వేములపల్లి మోహనకృష్ణ, వెలివెల శ్రీరాములు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆనందబాబును గజమాలతో సత్కరిస్తున్న జనసైనికులు

చంద్రబాబు సీఎం అయిన వెంటనే పింఛన్ రూ.4 వేలకు పెంపు



గోవాడ ప్రచారంలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి ఆనందబాబు

అమృతలూరు, మే 2: టీడీపీ అధినేత, నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన వెంటన పేదలకు అందించే పెన్షన్‌ను 4 వేలకు పెంచుతామని మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు తెలిపారు. మండల పరిధిలోని గోవాడ, పాంచాళవరం గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బలపరిచిన అభ్యర్థి గా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే పెంచిన పింఛన్‌ను అందిస్తామని చెప్పారు. వేమూరు నియోజకవర్గంలో మూడుసార్లు పోటీ చేసి రెండుసార్లు గెలుపొందాను. 4వ సారి పోటీ చేస్తూ మీ ముందుకు వచ్చాను. నామీద పోటీ చేసిన వ్యక్తి 6 నెలల క్రితం నియోజకవర్గం వదలి పారి పోయాడు. ఎక్కడ నుండో వచ్చిన వ్యక్తిని ఇక్కడ పోటీకి పెట్టారు. నేను ఎప్పటికి మీ మధ్య ఉండే వ్యక్తినే అన్నారు. జగన్ మోసపూరిత మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని హితవు పలికారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన వెంటనే చదువుకునే ప్రతి ఆడపిల్లకు అమ్మఒడి ఇస్తారన్నారు. ప్రతి కుటుంబానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగులకు యువగళం నిధి కింద నెలకు రూ.3 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. బీసీలకు రక్షణ చట్టం తెచ్చి వారిని అన్ని విధాలుగా ఆదుకుంటారన్నారు. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలు, యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పించనున్నట్లు చెప్పారు. రాష్ట్రం భవిష్యత్తు, మన భవిష్యత్తు మారాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరారు. ప్రచారంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

● టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ

చెరుకుపల్లి, మే 2: టీడీపీ ప్రభుత్వం ఏర్పడితేనే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రత్యేక నిధులతోపాటు పింఛను సౌకర్యం కలుగుతుంద ని టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ అన్నారు. గురువారం ఆరుంబాక ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన స్ట్రీట్ కార్నర్‌పాయింట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లతో విడుదల చేయాల్సిన నిధులను విడుదల చేయకుండా జగన్ మోసం చేశారని ఆయన ప్రజలకు వివరించారు. టీడీపీ ప్రభుత్వం వస్తే మహిళలకు ఉచి తంగా మూడు గ్యాస్ సిలెండర్లు, 50 సంవత్సరాలకే పింఛను అందిస్తారన్నారు. ప్రతి నెల రూ.4 వేల చొప్పున ఇంటి వద్దకే తెచ్చి పింఛన్లను అందిస్తామన్నారు. మహిళలకు రాష్ట్రం మొత్తం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తారన్నారు. గ్రామ సీమలు అభివృద్ధి దిశ గా సాగాలంటే అనగానిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉంద న్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ మొఖమాటం రాధాకృష్ణమూర్తి, టీడీపీ నాయకులు వేము మోహన్‌బాబు, బొలగాని సుబ్బారావు, ఈవూరి దుర్గాప్రసాద్, వేము సోమయ్య, మత్తి శ్రీనివాసరావు, ముత్తయ్య, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మూడు మండలాల్లో ఆనందబాబు ప్రచారం

వేమూరు, మే 2 : నియోజకవర్గంలోని చుండూరు, అమర్తలూరు, వేమూరు మండలాల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం అసెంబ్లీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఉదయం ఎనిమిది గంటలకు చుండూరు మండలంలోని ఆలపాడు, కారుమూరివారిపాలెం, చినగాదెలవర్రు, చిన పరిమి, గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు అమృతలూరు మండలంలోని యడవూరు గ్రామంలో, ఐదు గంటలకు వేమూరు మండలంలోని జంపని గ్రామంలో పర్యటించనున్నారు. జనసేన, టీడీపీ శ్రేణులు ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహిస్తారు.

కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలి

భట్టిప్రోలు, మే 2 : కూటమి అభ్యర్థుల గెలుపు కోసం సభ్యులు శక్తి వంచన లేకుండా పని చేయాలని టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం సభ్యులు పమిడిముక్కల మణికంఠ పిలుపునిచ్చారు. మండలంలోని వెల్లటూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ టీడీపీ-జనసేన కూటమి గెలుపు కోసం ఎన్ఆర్ఐ విభాగ సభ్యులు కష్టించి పని చేద్దామన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి గెలుపు తథ్యమని విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు సీఎం కావడం ఖాయమని పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని మణికంఠ కోరారు.



28వవార్డులో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అనగాని, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని

జగన్‌ను తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయి

● అభివృద్ధిని చూసి అండగా నిలవండి ● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, మే 2: జగన్ ఎన్ని అబద్ధాలు ప్రచారాలు చేసిన గెలిచేది టీడీపీ కూటమినేనని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. గురువారం భారీ జనసందోహం మధ్య పట్టణంలో శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి రాజేశ్ థియేటర్ 2వవార్డు ఏకలవ్య కాలనీ, 2వార్డు ఎస్టీ కాలనీ, అంకమ్మచెట్టు, పేటేరు రోడ్డు, 21వ వార్డులోని పోస్టాఫీసు రోడ్డు, ఇండియన్ బ్యాంకు రోడ్డులో ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు హారతులనిస్తూ పూలు చల్లుతూ స్వాగతం పలికారు. ప్రచారంలో వేలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనగాని మాట్లాడుతూ జగన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుని అబద్ధాల ప్రచారాలకు దిగాడని, అభివృద్ధి అనే పదానికి అర్థం తెలియని జగన్‌రెడ్డి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవ్వటం దురదృష్టమన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాల ద్వారా మహిళా సాధికారతే ధ్యేయంగా మహిళాభివృద్ధి కోసం పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయనున్నారన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం యువతను నట్టేట ముంచిందని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా దగా చేశారని, ఉద్యోగులను హింసించారన్నారు. ఇలాంటి పనులకు పూనుకున్న జగన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఓటు హక్కు ద్వారా బుద్ధి చెప్పాలని అన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే పట్టణంలోని తాగునీటి సమస్య పరిష్కరించి ఇంటింటికి కుళాయిని అందిస్తామన్నారు. రహదారుల అభివృద్ధితో పాటు పట్టణంలో నెలకొన్న డ్రైయినేజీ సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. అనంతరం మండలంలోని ఉప్పూడి గ్రామంలో జనసేన నాయకులు అల్లంశెట్టి సతీష్‌బాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అనగాని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఉప్పూడి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు, తాతా ఏడు కొండలు, గోగినేని పట్టాభిరామారావు, కొలసానిరాము, మద్దుల అంకాలు, షేక్ ఖాదర్‌బాషా, ఆలూరి దానియేలు, జీవీ నాగేశ్వరరా వు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, దాసరి నాగరాజు, జనసేన పట్టణాధ్యక్షుడు రాసంశెట్టి మహేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



5వవార్డులో ఎమ్మెల్యే అనగానిని గజమాలతో సన్మానిస్తున్న ఏకలవ్య కాలనీవాసులు

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం : అనగాని



షేక్ సలీమ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని

రేపల్లె, మే 2: ఎన్డీయే కూటమి తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణంలోని 24వవార్డుకు చెందిన వైసీపీ నాయకుడు షేక్ సలీం నిజాంపట్నం మండలం చెక్కావారిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు రాగం శ్రీనివాసరావు, ఎల్ రాఘవయ్య, సాంబశివరావు, డేగల శ్యామ్యూలు, కోడే కోటేశ్వరరా వు, మిరియాల సాంబయ్య, రాంబాబు, నిజాంపట్నం మండలం కళ్లిపాలెంనకు చెందిన దాసరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బొలగాని తిరుపతిరావు, బొలగాని వెంకట్రావు, బి.సాంబశివరావు, బి.అంకమ్మ, మరో 20కుటుంబాల వారికి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, గూడపాటి శ్రీనివాసరావు, జీవీ నాగేశ్వరరావు, గోగినేని పట్టాభిరామారావు, ల్యాబ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అనగానికి అండగా నిలవండి

● నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తారు

● ఎమ్మెల్యే సోదరి డాక్టర్ అనగాని కమల



ప్రజలకు కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే సోదరి డాక్టర్ అనగాని కమల

రేపల్లె, మే 2: ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో సాగే నాయకు డు అనగాని సత్యప్రసాద్ అని ఎమ్మెల్యే సోదరి డాక్టర్ అనగాని కమల అన్నారు. గురువారం నిజాంపట్నంలో ఎమ్మెల్యే అనగాని గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే అనగాని రేపల్లె నియోజకవర్గానికి రూ.2వేల 200 కోట్లతో గ్రామాల అభివృద్ధి, ప్రజలకు సమృద్ధిగా తాగునీరు, మినీ వాటర్ స్కీమ్స్, నిర్మించారన్నారు. గ్రామ గ్రామాన సీసీ రోడ్లు ఏర్పాటు చేశారన్నారు. తీరప్రాంతంలోని మత్స్యకారులకు తుఫాన్ షెల్టర్లు సబ్సిడీపై మత్స్యకారుల ఉపాధి కోసం లోన్లు, చేపల వేట పరికరాలు, బోట్లు, అందించారన్నారు. రైతుల కోసం సబ్సిడీలో అధునాతన యంత్రాలు, పండించిన పంటకు గిట్టుబాటు ధర, సబ్సిడీపై ఎరువులు అందిం చిన ఘనత టీడీపీదేనన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొమ్మిడి రామకృష్ణ, కేసన వాసు, దండమూడి ధరణికుమార్, యేమినేని బుల్లిబాబు, వర్ధిని, తుమ్మల విజయశాంతి, హైమా, కవితసాగర్, శివ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి : అఖిలేశ్



భట్టిప్రోలులో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డాక్టర్ అఖిలేశ్

భట్టిప్రోలు, మే 2 : కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు తనయుడు డాక్టర్ నక్కా అఖిలేశ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి భట్టిప్రోలులో ఇంటింటికి తిరిగి ఎమ్మెల్యే అభ్యర్థి నక్కా ఆనందబాబును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన నాయకుడు నక్కా ఆనందబాబును గెలిపించినట్లయితే మీకు అందుబాటులో ఉంటూ సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నా రు. అవినీతి లేని జనరంజక పాలన కోసం ఆనందబాబును గెలిపించాలని అఖిలేష్ కోరారు. అఖిలేష్ ప్రచారానికి ఓటర్ల నుంచి అనూహ్య స్పందన లభించింది. టీడీపీ, జనసేన శ్రేణులు అత్యధికంగా తరలివచ్చి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, నాయకులు కనపర్తి సుందర రావు, బి.మల్లికార్జునరావు, ఆదిన బసవపున్నయ్య, గొట్టుముక్కల లెనిన్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

4న రేపల్లెకు పవన్ కల్యాణ్

రేపల్లె, మే 2: జనసేన అధినేత కొణిదల పవన్‌కల్యాణ్ 4వతేదీ మధ్యాహ్నం 12గంటలకు రేపల్లె రానున్నారని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉప్పూడి రోడ్డులోని హెలిప్యాడ్ వద్ద దిగి ర్యాలీగా లక్ష్మీటాకీస్ రోడ్డులోని నుంచి బస్టాండ్ సెంటర్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకుని సభలో పవన్ కల్యాణ్ ప్రసంగించనున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని జనసేన, టీడీపీ, బీజేపీ, నాయకులు, కాకర్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చెయ్యాలని అనగాని కోరారు.

ప్రచారం.. ముమ్మరం

కీలకమైన నామినేషన్ల ఘట్టంతోపాటు ఉపసంహరణల పర్వం కూడా ముగిసి బరిలో ఉండే అభ్యర్థులపై స్పష్టత కూడా రావడంతో ఇక అభ్యర్థులు ప్రచారంపై పూర్తి స్థాయిలో దృష్టిసారించారు. ముఖ్యంగా ప్రధాన రాజకీయ పార్టీల తరపున బరిలోఉండే అభ్యర్థులు సర్వశక్తులు ఒడ్డి పోరాడుతున్నారు. ఇంకా తొమ్మిది రోజులు మాత్రమే సమయం ఉండడంతో మండుటెండను సైతం లెక్క చేయక ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు పోటీపడుతున్నారు.

- ఇక మిగిలింది తొమ్మిది రోజులే..
- మేనిఫెస్టో హామీలతో పాటు స్థానిక అంశాలపైనే ప్రధానపార్టీల దృష్టి
- ఐదేళ్లలో జరిగిన విధ్వంసంపైనే కూటమి ఫోకస్
- మండుటెండలో చెమటలు కక్కుతూ నేతల ప్రచార హోరు
- వార్డులవారీగా కూడికలు, తీసివేతలతో పరిశీలకుల బిజీ
- జిల్లాలకు ముఖ్యనేతల తాకిడి

బాపట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, వైసీపీ మేనిఫెస్టో ప్రకటించడంతో ప్రచారంలో వాటిని అస్త్రాలుగా చేసుకుని ముందుకువెళుతున్నారు. కూటమి మేనిఫెస్టో జనరంజకంగా ఉండడంతో అభ్యర్థులు ప్రచారంలో మరింత ఉత్సాహంతో అడుగులేస్తుండగా, వైసీపీ మాత్రం ఆ విషయంలో డీలా పడింది.వైసీపీ పాలనలోని ఐదేళ్లలో జరిగిన విధ్వంసంపైనే టీడీపీ నేతలు ప్రధానంగా ఫోకస్ పెట్టి ప్రచారాన్ని సాగిస్తున్నారు. మరోవైపు ట్రెండ్ కూటమి వైపు ఉందనే సంకేతాలు ఉండడంతో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు జోరందుకున్నాయి. వారిని ఆపడానికి వైసీపీ తంటాలు చెప్పనలవి కాకుండా ఉంది. మరోవైపు పగలు ప్రచారం, రాత్రివేళల్లో మంతనాలు, వార్డుల వారీగా రివ్యూలతో పార్టీ కార్యాలయాలు, నేతల ఇళ్ల జాతరను తలపిస్తున్నాయి. మధ్యమధ్యలో ప్రధానపార్టీల తరపున రాష్ట్రస్థాయి నేతలు వచ్చి వెళుతుండడంతో ఆయాపార్టీల శ్రేణుల్లో గెలుపు ధీమా మరింత పెరుగుతోంది.

కూటమి అధికారంలోకి వస్తే...

ఏళ్లుగా పరిష్కారం లభించని అనేక సమస్యలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గాడిన పెడతామనే హామీని నేతలు ఇస్తున్నారు. మొన్నటి వరకు పార్టీ అభ్యర్థి మాత్రమే ప్రచారం చేసేవారు. ఇప్పుడు సమయం దగ్గర పడుతుండడంతో కుటుంబసభ్యులతో పాటు పార్టీలోని ద్వితీయశ్రేణి నేతాగణానికి కూడా వార్డుల వారీ ప్రచార బాధ్యతలను అప్పగించారు. ప్రచారంలో ఇప్పటివరకు టచ్ చేయని ప్రాంతాలపై దృష్టిపెట్టడంతో పాటు, ప్రతికూలత ఉన్న ఏరియాల్లోనే ఇకమీదట ఎక్కువగా ప్రచారం చేయాలనే అంచనాకు నేతలు వచ్చారు. పార్టీ తరపున నియోజకవర్గాల్లో ఉన్న పరిశీలకుల సూచనలు, సలహాలు కూడా పాటిస్తూ అభ్యర్థులు ప్రచారంలో దూకుడు పెంచారు.

సోషల్ మీడియాపైనా దృష్టి...

ఇక ఉన్న సమయం తక్కువగా ఉండడంతో కోడ్ నిబంధనల మేరకు సోషల్ మీడియాలో ప్రచారంపై కూడా నేతలు దృష్టిసారించారు. వారి ఖాతాలను నిర్వహించడానికి ప్రత్యేకంగా ఓ టీంను ఏర్పాటు చేసుకున్న నేతలూ ఉన్నారు. సోషల్‌మీడియాలో ఎక్కువగా యువతను ఆకట్టుకునే అంశాలపై దృష్టిసారించారు. కూటమి మేనిఫెస్టోలో కీలకమయిన ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలతో పాటు నిరుద్యోగ భృతి వంటి వాటిపై కూటమి అభ్యర్థులు దృష్టిసారించారు. ఇవే కాకుండా చంద్రబాబుకు ఉన్న ఐటీ బ్రాండ్‌ను కూడా అభ్యర్థులు యువతను లక్ష్యంగా చేసుకుని గుర్తు చేస్తూ వారి భవిష్యత్తుకు భరోసా ఇస్తూ ప్రచారం చేస్తున్నారు.

విధ్వంసం, అరాచకాలను గుర్తు చేస్తూ...

ఐదేళ్ల పాలనలో అధికారపార్టీ చేసిన విధ్వంసంతో పాటు అరాచకాలను గుర్తు చేస్తూ కూటమి అభ్యర్థులు ప్రచారం సాగిస్తుండగా అరకొరగా అమలు చేసిన సంక్షేమ పథకాలనే నమ్ముకుని వైసీపీ అభ్యర్థులు ఓటర్ల ముందుకువెళుతున్నారు. గతంలో సామాన్య జనంతో పాటు వ్యాపార వర్గాలను భయభ్రాంతులకు గురిచేసిన సందర్భాలను ప్రజల్లో మరోమారు చర్చకు పెడుతూ కూటమి అధికార ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తున్నారు.

ముఖ్యనేతల తాకిడి...

ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ జిల్లాలకు ప్రచారానికి వచ్చే రాష్ట్ర స్థాయి నేతల తాకిడి ఎక్కువైంది. ఇటీవలే సీఎం జగన్మోహనరెడ్డి గుంటూరు జిల్లా పొన్నూరులో పర్యటించగా, తెనాలిలో పవన్‌కల్యాణ్, గుంటూరు, చీరాలలో చంద్రబాబు ప్రజాగళం సభలు బుధవారం జరిగిన సంగతి తెలిసిందే. రేపు రేపల్లెలో కూటమి అభ్యర్థికి మద్దతుగా పవన్‌కల్యాణ్ పర్యటన కాగా 7న పొన్నూరులో పవన్ ప్రచారం చేయనున్నారని సమాచారం. సీఎం జగన్మోహనరెడ్డి ఈనెల 6 వతేదీని రేపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహించనుండగా, వెంటనే చీరాలలో కూడా సీఎం జగన్ ప్రచారం చేయనున్నారని తెలుస్తోంది.



కూడికలు, తీసివేతలతో బిజీబిజీ...

అభ్యర్థులు ప్రచారంలో తలమునకలై ఉంటే పార్టీలు నియోజకవర్గాల వారీగా నియ మించిన పరిశీలకులు వార్డుల వారీ బలాబలాలతో పాటు కూడికలు తీసివేతలతో బిజీబిజీగా గడుపుతున్నారు. ప్రతి రోజూ ఆ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై అధిష్టానానికి నివేదిక ఇవ్వాల్సిన పరిశీలకులపై ఉండడంతో వారూ అభ్యర్థులతో సమానంగా పనిచేస్తూ వారి గెలుపు కోసం తెరవెనక వ్యూహాలు రచించే పనిలో నిమగ్నమయి ఉన్నారు.

రెండుపూటల ప్రచారం...

పోలింగ్‌తేదీ దగ్గర పడుతున్న కొద్దీ అభ్యర్థులు రెండు పూటల ప్రచారం చేస్తున్నారు. ఉదయం వేళ టిఫిన్ విత్ లీడర్ అంటూ అటు ప్రచారం ఇటు ప్రజలతో మమేకం అవుతున్నారు. ఎండ తీవ్రంగా ఉండడంతో ఉదయాన్నే ప్రచారం మొదలెట్టి పదకొండుగంటల సమయానికి ఓ దశ ముగించి మళ్లీ సాయంత్రం మొదలెట్టి పది గంటల వరకు తిరుగుతున్నారు. మరోవైపు ప్రచారంలో అవలంబించే వ్యూహాలను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు

రేపటి నుంచే ఇంటి వద్దే ఓటు

- దరఖాస్తు చేసుకున్న వారంతా వినియోగించుకోవాలి



బాపట్ల, మే 2: సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా ఎన్నికల సంఘం అమల్లోకి తీసుకొచ్చిన హోం ఓటింగ్(ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగం) ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. జిల్లా పరిధిలోని లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 85 ఏళ్లపై బడిన వారు, దివ్యాంగులు తమ ఓటు హక్కును ఇంటి వద్దే వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు ఇంటి వద్దనే ఓటు వేసే విధానం చేపట్టామన్నారు. 85 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పారదర్శకంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని బరిలో ఉన్న అభ్యర్థులు లేదా వారు నియమించుకున్న ఏజెంట్లు హాజరై పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహిస్తూ పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారంతా నిర్ణయించిన ఫెసిలిటేషన్ కేంద్రాల ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. ఓటు హక్కు కలిగిన వారందరికీ సొంత నియోజకవర్గంలోనే ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించామన్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. నిర్ణయించిన తేదీల్లో ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు వేయవచ్చన్నారు. వేమూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రేపల్లెలో క్రిస్టియన్ కళాశాల, బాపట్లలో మున్సిపల్ హైస్కూల్, పర్చూరులో నాగులపాలెం వద్ద సెయింట్ ఫ్రాన్సిస్ డి.సేల్స్ హైస్కూల్, అద్దంకిలో ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ పక్కన శ్రీప్రకాశం గవర్నమెంట్ జూనియర్ కాలేజి, చీరాలలో మున్సిపల్ కార్యాలయం వద్ద యార్లగడ్డ అక్కమాంబ మహిళా కళాశాలలో ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

- పోలీసులు, అత్యవసర సేవల విభాగాల వారు, డ్రైవర్లు, క్లీనర్లు, వీడియోగ్రాఫర్లు, ఇతర ఎన్నికల విధులు నిర్వహిస్తున వారు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్స్ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు.
- జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తూ ఇతర జిల్లాలో ఓటు హక్కు కలిగి ఉన్న వారు మే 7, 8 తేదీల్లో బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు.

కాంగ్రెస్‌తోనే హోదా.. అభివృద్ధి

- మహిళలకు ఏడాదికి రూ.లక్ష పథకం
- రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మాణిక్కం ఠాగూర్

గుంటూరు, మే 2: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఏపీకి ప్రత్యేక హోదా వస్తుందని, గుం టూరు అభివృద్ధి జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగం గా గురువారం గుంటూరు పర్యటనకు వచ్చిన ఆయన మాజీ ఎమ్మెల్యే, తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి షేక్ మస్తాన్‌వలి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావుతో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. లాలాపేటలో రోడ్‌షో నిర్వహించిన ఆయన పూల మా ర్కెట్ సెంటర్‌లో ప్రసంగించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జీఎస్టీలో శ్లాబులు మార్చి ప్రజలకు ఊరట కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఏటా లక్ష రూపాయ లను నేరుగా లబ్ధిదా రులకు ఖాతాల్లో వేస్తామని తెలిపారు. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలతో ప్రజలు విసుగెత్తి పోయారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే మార్పు సాధ్యమవుతుందన్నారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి తప్ప పదేళ్లలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. నగరాభివృద్ధిపై ఏ చర్చకైనా సిద్ధమేనని సవాల్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నూనె పవన్‌తేజ, కట్టా జవహర్‌బాబు, పలగాని రామకృష్ణ, అంబటి రత్తయ్య తదితరులున్నారు.



లాలాపేటలో ప్రచారం చేస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మాణిక్కం ఠాగూర్ , మస్తాన్‌వలి తదితరులు



రోడ్ షోలో ప్రసంగిస్తున్న మాణిక్కం ఠాగూర్ పక్కన మస్తాన్‌వలి, లింగంశెట్టి తదితరులు



రోడ్ షోకు హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు

పోస్టల్ బ్యాలెట్‌పై అస్పష్టత





- ఈసీ ఉత్తర్వులు ఇచ్చినా తొలగని అపోహలు
- ఫారం-12డీలపై ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్ కోసం ఓపీవోలు, ఇతర సిబ్బంది తమ ఫారం-12డీలను ఏ మండల ఏఆర్‌వోకు ఇవ్వాలో ఇప్పటికే ఎన్నికల సంఘం స్పష్టంగా పేర్కొన్నది. ఉద్యోగి పనిచేస్తున్న నియోజకవర్గంలోని ఏఆర్‌వోకే ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చినా ఇంకా కొంత మందిలో అపోహలు తొలగిపోలేదు. నేటికీ తమ ఓటు ఫలానా నియోజకవర్గంలో ఉంది, తాము ఇక్కడ పనిచేస్తున్నాం. ఎక్కడ ఓటు వేయాలి అంటూ ఇంకా అస్పష్టతతో ఉన్నారు. కాగా గత నెల 20నే ఈసీ ఈ విషయంలో అనుమానాలు తొలగిస్తూ మార్గదర్శకాలను జారీ చేసింది. ఈసీ జారీ చేసిన నిబంధనల ప్రకారం ఉద్యోగి ఎక్కడైతే పని చేస్తున్నాడో తన ఓటు వేరే నియోజకవర్గం/జిల్లాలో ఉన్నా ఫారం-12డీని మాత్రం పని ప్రదేశంలోని నియోజకవర్గ కేంద్రంలో ఉండే ఏఆర్‌వోకే ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ఇప్పటికే ముగిసింది. ఏఆర్‌వోలు తమ వద్దకు వచ్చిన ఫారం-12డీలను ఏ రోజుకు ఆ రోజు ఆర్‌వోలకు పంపాలి. వాటిల్లో సొంత నియోజకవర్గానివి ఆర్‌వోల వద్దనే ఉంచుకుని ఇతర నియోజకవర్గాలు/జిల్లాలవి జిల్లా ఎన్నికల అధికారికి పంపాలి. జిల్లాలోనే వేరే నియోజకవర్గంలో ఉద్యోగి ఓటు ఉంటే అక్కడి ఆర్‌వోకి సంబంధిత ఫారం-12డీలను జిల్లా ఎన్నికల అధికారి పంపించాలి. అదే వేరే జిల్లాలకు చెందిన వారి ఫారంలను ఓటరు ఐడీతో జిల్లా ఎన్నికల అధికారి సంబంధిత డీఈవోకు పంపించాలి. ఇందుకోసం ఎన్నికల సంఘం గత నెల 28నే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏపీ సచివాలయం వెలగపూడిలో ఏ జిల్లాకు ఆ జిల్లా ఫారంలను ఎక్స్ఛేంజ్ చేసుకునేందుకు ఫస్టు సెంట్రల్ ఎక్స్ఛేంజ్ పేరుతో కార్యక్రమాన్ని కూడా నిర్వహించింది. ఆ రోజున అన్ని జిల్లాల డీఈవోలు తమ సిబ్బందిని అక్కడికి పంపారు. ఇలా వచ్చిన ఫారాలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్లను సంబంధిత ఆర్‌వోల వద్ద నుంచి తెప్పించి మే 3న జరిగే సెకండ్ సెంట్రల్ ఎక్స్ఛేంజ్ రోజున వాటిని అందజేస్తారు. ఇలా పోస్టల్ బ్యాలెట్ తీసుకున్న వారు ఫెసిలిటేషన్ సెంటర్‌కు వెళ్లి ఓటు వేయాల్సి ఉంటుంది. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ని పీవోలు, ఏపీవోలు, మైక్రో అబ్జర్వర్లకు మే 5న, ఓపీవోలకు మే 6న, పోలీసు సిబ్బంది, ఏవీఈఎస్, ప్రైవేటు వ్యక్తులకు మే 7న, ఇతర జిల్లా ఓటర్లకు మే 8న నిర్వహిస్తారు. పోలింగ్ అయిన పోస్టల్ బ్యాలెట్‌లు, వినియోగించని వాటిని అనెక్సూర్-6లో పేర్కొంటూ మే 10న వెలగపూడి సచివాలయంలో నిర్వహించే థర్డ్ సెంట్రల్ ఎక్స్ఛేంజ్‌లో అందజేయాలి.

వైసీపీని ఓడించడమే బీసీల లక్ష్యం

- ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

మంగళగిరి, మే 2: బీసీలను అన్ని రకాలుగా అణగదొక్కిన వైసీపీ ప్రభుత్వా న్ని ఓడించడమే బీసీల లక్ష్యమని ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో గురువారం బీసీ సామాజికవర్గ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. మంగళగిరిలో నారా లోకేశ్ గెలుపు కోసం బీసీలు అవలంభించాల్సిన పలు అంశాలపై చర్చిం చారు. అనంతరం టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్యతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం బీసీల కోసం అమలు చేసిన 34 సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 25 శాతానికి తగ్గించిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. బీసీలకు మొక్కుబడిగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నామమాత్రపు నిధులు కూడా ఇవ్వకుండా బీసీ లను దారుణంగా వంచించారని పేర్కొన్నారు. బీసీ సబ్‌ప్లాన్ నుంచి సుమారు రూ.34 వేల కోట్ల నిధులను దారిమళ్లించారని ఆరోపించారు. జగన్ హయాంలో అత్యధికంగా నష్టపోయింది బీసీలేనని చెప్పారు. టీడీపీ హయాంలో బీసీలకు స్వయం ఉపాధికి రుణాలు, చేతి వృత్తుల వారికి ఆదరణ పథకం కింద 90 శాతం రాయితీపై వృత్తి పరమైన పరికరాలు అందించారని గుర్తుచేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రజకులను ఎస్సీల్లో చేర్చాలని చంద్రబాబు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారని తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రకటించిన బీసీ డిక్లరేషన్ బీసీలకు బ్రహ్మాస్త్రంలా పనిచేస్తుందన్నారు. మంగళగిరిలో బీసీలంతా ఐక్యంగా పనిచేసి నారా లోకేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో రజక సాధికార సమితి రాష్ట్ర కన్వీనరు గుర్రపుశాల రామకృష్ణ, కృష్ణ బలిజ, పూసల సాధికార సమితి కన్వీనరు వేణుగోపాల్, కావేటి యల మందరావు, దావులూరి శ్రీనివాసరావు, వల్లభాపురపు శంకర్, నూతక్కి నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నా ఎన్నికల ఖర్చు.. పదివేలే

- ఇందిరాగాంధీయే స్వయంగా వచ్చి నాకు బీ ఫాం ఇచ్చారు
- చంద్రబాబు, వైఎస్, నేనూ ఒకేసారి అసెంబ్లీలో అడుగుపెట్టాం
- నిజాయితీ, అభివృద్ధి చేసే వారినే ఎన్నుకోవాలి
- కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు



గుంటూరు, మే2: టీడీపీ అధినేత చంద్రబాబు, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డిలతో సమకాలికులైన గుంటూరు నగరానికి చెందిన లింగంశెట్టి ఈశ్వరరావు ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థిగా 1978లో గుంటూరు-1 (ప్రస్తుతం గుంటూరు తూర్పు) నుంచి పోటీచేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఆయనతో పాటు మాజీ సీఎం చంద్రబాబు, దివంగత సీఎం వైఎస్ఆర్‌లు ఒకేసారి అసెంబ్లీకి వెళ్లారు. అప్పట్లో లింగంశెట్టికి ఎన్నికల కోసం అయిన ఖర్చు అక్షరాల రూ.10వేలకు కూడా మించలేదు. అదీ ఆయన మామ సొంత ఖర్చులు వెచ్చించి ఎన్నికలు చేశారు. అప్పట్లో ఎవరికి వారు అభిమానులు, కార్యకర్తలు ఖర్చులు పెట్టుకునేవారు. ప్రస్తుతం ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని చూసిన లింగంశెట్టి దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నాటి - నేటి పరిస్థితులపై మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆయన మాటల్లోనే...

- అప్పట్లో నేను ఇందిరా నవసమాజ్ నిర్మాణ సమితి సంస్థ పేరుతో విస్తృతమైన సేవలందించాం. కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలకు గుర్తించిన ఇందిరాగాంధీయే అప్పట్లో స్వయంగా గుంటూరు వచ్చి 1978 ఎన్నికలకు నాకు గుంటూరు -1 అభ్యర్థిగా పోటీ చేసేందుకు బీ ఫాం అందజేయటం మరిచిపోలేనది. అప్పట్లో రాజకీయ ఉద్దండులైన ఆచార్య ఎన్‌జీ రంగా, పీవీ నరసింహరావు, పీ రాజారామ్‌లు వచ్చి నా తరపున ప్రచారం చేశారు. నా వద్ద డబ్బు లేకపోతే మా మామ చింతా వెంకటరత్నం ఎన్నికల ఖర్చు సమకూర్చారు. మొత్తంగా రూ.10వేలకు కూడా మించలేదు. ఆ ఎన్నికల్లో విజయం సాధించా.
- 1978లో చంద్ర బాబు, నేనూ ఇందిరా కాంగ్రెస్ నుంచి గెలుపొందితే వైఎస్ రాజశేఖరరెడ్డి రెడ్డి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. ఆ తరువాత నేను భవనం వెంకటరామిరెడ్డి వైఎస్ఆర్‌తో మాట్లాడి రెడ్డి కాంగ్రెస్ నుంచి ఇందిరా కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చాం. ఆ తరువాత భవనం వెంకటరామిరెడ్డి కేబినెట్‌లో చంద్రబాబు, వైఎస్ఆర్‌లు మంత్రులుగా పనిచేశారు. ఆ తరువాత నేను ప్రభుత్వ విప్‌గా వ్యవహరించా. గుంటూరులో 20వేల కుటుంబాలకు ఇళ్ల స్థలాల పట్టాలిచ్చాం. నాగార్జున యూనివర్శిటీ పాలకవర్గ మెంబర్‌గా దూర విద్యా కేంద్రాన్ని తీసుకొచ్చాం.
- అప్పట్లో ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చారు. ప్రస్తుతం రాజకీయాలు వ్యాపారాలుగా మారాయి. ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యం పెరగటం, ధన ప్రవాహం ఎక్కువవటంతో రాజకీయాలు ఖరీదయ్యాయి. సామాన్యుడు రాజకీయాల్లోకి రాకపోతే ప్రజాస్వామ్యానికే ప్రమాదమన్నారు.
- నిజాయితీ వ్యక్తిత్వం, అభివృద్ధి చేసే నాయకుడితో పాటు ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండే నాయకుడిని ప్రజలు ఎన్నుకోవాలి. గుంటూరు జిల్లా ప్రజలు విజ్ఞులు, నాటి నుంచి నేటి వరకు డబ్బు లేని వారిని గెలిపించారు... డబ్బులున్న వారినీ గెలిపించారు. ఎప్పటికప్పుడు పనిచేయని నాయకుడికి జిల్లా ప్రజలు తమ ఓటు పవర్ ఏంటో చూపించారు కూడా.

ముమ్మరంగా కూటమి శ్రేణుల ప్రచారం

కొండయ్య ఇంటింటి ప్రచారం

చీరాల, మే 2 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. గురువారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన నాయకులు, కార్యకర్తలతో కలసి పర్యటించారు. వేటపాలెం, దేశాయిపేట, ఐటీఐ కాలనీ, రామానగర్, చల్లారెడ్డిపాలెం కొత్తపాలెం, హరిప్రసాద్ నగర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఒక వైపు ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తూ మరో వైపు ఆయా ప్రాంతాల్లోని ముఖ్యులతో అంతరింగిక సమావేశాలు నిర్వహించారు. ఆయా సందర్భాల్లో ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కొం డయ్య కోరారు. అనంతరం చీరాల మండలం జాండ్రపేటలో పలువురు ప్రముఖులను కలిశారు. అనంతరం పట్టణంలో 23, 25, 26 వార్డులలో ఇంటింటి ప్రాచరం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారంలో చంటి బిడ్డతో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య

బీసీ డిక్లరేషన్‌తో సువర్ణాధ్యాయం


నేతను పరిశీలిస్తున్న నిఖిల్

టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌తో సువర్ణాధ్యాయానికి శ్రీకారం పలికారని టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్య కుమార్తె గోరిపర్తి శివనారాయణదేవి అన్నారు. తన తండ్రి కొండయ్యకు మద్దతుగా బుధవారం వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ నీలకంఠాపురంలో నాయకులు, కార్యకర్తలతో క లసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రధానంగా బీసీ డిక్లరేషన్‌తో కలిగే ప్రయోజనాలను వివరించారు. కూటమి ఉమ్మ డి మేనిఫెస్టోలో ఇచ్చి న హామీలతో ప్రతి ఒ క్కరూ ఆర్థికంగా, సా మాజికంగా బలోపేతం అవుతారన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండయ్య ను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కారకర్తలు పా ల్గొన్నారు.

మామయ్యను గెలిపించండి

హీరో నిఖిల్

మా మామయ్య, టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండయ్యను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రముఖ సినీహీరో నిఖిల్ సిద్ధార్థ పిలుపునిచ్చారు. కొండయ్యకు మద్దతుగా గురువారం నిఖిల్ కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీగా కృష్ణప్రసాద్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండయ్యను సైకిల్ గుర్తులపై ఓట్లువేసి గెలిపించాలని కోరారు. నిఖిల్‌తో సెల్ఫీలు దిగేందుకు పలు వురు పోటీపడ్డారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

చీరాలటౌన్ : కొండయ్యను గెలిపించాలని సినీహీరో నిఖిల్ పట్టణంలో ప్రచారం చేశారు. పాలిమేర రోడ్డులోని జానకి హోటల్‌లో సాధారణ వ్యక్తిలా టిఫిన్ చేస్తూ ప్రచారం నిర్వహించారు. కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపిస్తే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయి అభివృద్ధిని పరుగు పెట్టిస్తారని హీరో నిఖిల్ తెలిపారు.

మాట తప్పిన జగన్‌కు ఓట్లడిగే హక్కు లేదు

- సీపీఎస్ రద్దు.. మద్య నిషేధంపై మడమతిప్పారు
- కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి

పర్చూరు, మే 2 : పాదయాత్రలో హామీలిచ్చి, గద్దె నెక్కాక వాటిని అమలు చేయని జగన్‌రెడ్డి ఇప్పుడు ఓట్ల కోసం పాకులాడుతున్నారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు అన్నారు. జగన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే సీపీఎస్ రద్దు, మద్య నిషేధం అమలు చేసి ఓట్లు అడగాలని ఏలూరి డిమాండ్ చేశారు. గురువారం చిన్నగంజాం మండలంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఏలూరి పాల్గొన్నారు. ఏలూరికి ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. జగన్ ఉద్యోగులను నమ్మించి నిలువునా మోసం చేశారని, అధికారంలోకి వచ్చిన వారంలోనే సీపీఎస్ రద్దు చేస్తామని మాటిచ్చి మడమ తిప్పారన్నారు. ఖజానాను ఖాళీ చేసిన చేతగాని జగన్ 1వ తేదీన పింఛన్ కూడా ఇవ్వలేక చంద్రబాబుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు తాగు సాగు నీరు అందించేందుకు దోహద పడే గుంటూరు చానల్ పనులను సైతం నిలిపేశారన్నారు. మాట తప్పే జగన్‌ను గద్దె దించి.. పాలనాదక్షుడు చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. అనంతరం చింతగుంపల, కడవకుదురు, చిన్నగంజాం, కొత్తపాలెం, మూలగాని వారిపాలెంలో ప్రచారం నిర్వహించారు.


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

కూటమి శ్రేణుల విస్తృత ప్రచారం

పర్చూరు : పర్చూరులో తెలుగుదేశం ప్రజా కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే ఏలూరి గెలుపు కోసం చేస్తున్న ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభిస్తుంది. పార్టీలకు అతీతంగా ఏలూరి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు బ్రహ్మరథం పలుకుతున్నారు. కార్యక్రమంలో భాగంగా గురువారం పర్చూరులో ఒకటో వార్డులో చేపట్టిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. పెద్దఎత్తున మహిళలు, వృద్ధులు, యువకులు తరలివచ్చి ఏలూరికి మద్దతుగా నిలిచి ప్రచారంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు ప్రజా కూటమి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్‌కు ప్రస్తుత ఎన్నికలే కీలకం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లా శివరాంప్రసాద్, కోటగిరి ప్రసాద్, కొల్లా చౌదరి, కృష్ణంశెట్టి జగదీష్, కూరపాటి జగన్, ఊటుకూరి నిర్మల, కొల్లా సుబ్బాయమ్మ, శివాలశెట్టి రమ, నార్ని బ్రదర్స్, జేత భూపతి, జనసైనికులు అచ్చికోలు సతీష్, కొసనా యశ్వంత్ పాల్గొన్నారు.

కారంచేడు : అభివృద్ధి ప్రదాత, టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ గెలుపుకోసం కారంచేడులో టీడీపీ నాయకులు రామయ్య, ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డిని గద్దెదింపి, కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కోరా రు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాలపై నాయకులు అవగాహన కల్పించారు.

మక్కెనవారిపాలెంలో ఇంటింటి ప్రచారం

సంతమాగులూరు : మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామంలో కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సతీమణి గొట్టిపాటి ఝాన్సీ విజ్ఞప్తి చేశారు. మక్కెనవారిపాలెం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కూటమి మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలపై కరపత్రాలను పంచిపెడుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారని తెలిపారు. నిత్యావసరాల ధరల పెరుగుదలతో కుటుంబ పోషణ మహిళలకు కష్టమైందన్నారు. ఉద్యోగాలు రాక నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని చెప్పారు. జాబ్ క్యాలెండర్ అంటూ జగన్ రెడ్డి మోసం చేశారని విమర్శించారు. పన్నులు పెంచి నిరు పేదల నుంచి ధనవంతుల వరకు అందరినీ ఇబ్బందులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల కష్టాలు తీరాలంటే.. కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను ఆమె విజ్ఞప్తి చేశారు.

రేణుకమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు



యద్దనపూడి, (మార్టూరు) మే 2 : యద్దనపూడి మండలంలోని చింత పల్లిపాడు గ్రామంలోని శ్రీ చింతామణి రేణుకమ్మ తల్లి దేవస్థానంలో ఎనిమిదవ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో నారాయణ వెంకట సందీప్ దీక్షిత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్లపూడి వంశస్థుల కులదైవం కావడంతో ఈ ప్రాంతంలోని కర్లపూడి వంశస్తులు ముఖ్యంగా మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమ గా జులు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. చివరగా భక్తులకు భారీగా అన్నదానం నిర్వహించారు.

పోస్టల్ ఓటు వినియోగంపై అవగాహన

అద్దంకి, మే 2 : పోస్టల్ ఓటు వేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని నోడల్ ఆఫీసర్ పూర్ణచంద్రరావు అన్నారు. పోస్టల్ ఓటు వినియోగించుకునే ఆర్టీసీ ఉద్యోగులకు గురువారం ఆర్టీసీ గ్యారేజీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ముందస్తుగానే పూర్తి అవగాహన చేసుకొని పోస్టల్ ఓటు వినియోగించుకోవాలన్నారు. డీఎం రామ్మోహనరావు, అసిస్టెంట్ డీఎం మహబూబీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్

యద్దనపూడిలో పోలీస్ కవాతు

యద్దనపూడి, (మార్టూరు) మే 2 : యద్దనపూడి మండలంలోని వింజనం పాడు, చిలుకూరి వారిపాలెం, యనమదల, చింతపల్లిపాడు గ్రామాలలో గురువారం పోలీసులు కవాతు నిర్వహించారు. దాదాపుగా 25 మంది బీఎస్ఎఫ్ దళాలతో స్థానిక పోలీసులతో కలిసి ఎస్ఐ జీవీఎస్ చౌదరి గ్రామాలలో కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేవిధంగా ప్రజలు సహకరించాలని ఎస్ఐ ఆయా గ్రామస్థులను కోరారు. ఎన్నికల సమయంలో నమోదయ్యే కేసులు భవిష్యత్‌లో ఇబ్బందులకు గురి చేస్తాయని గొడవలకు కక్షలకు గ్రూపు తగాదాలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు.

నేడు విద్యుత్‌కు తాత్కాలిక అంతరాయం

చీరాలటౌన్, మే 2 : విద్యుత్ వార్షిక మరమ్మతులలో భాగంగా నేడు విద్యుత్‌కు తాత్కాలిక అంతరాయం కలుగుతుందని అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. జాండ్రపేట, గంజిపాలెం, కొత్తపేట ప్రాంతాలలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని మరమ్మతుల అనంతరం యధావిధిగా సేవలు ప్రారంభమౌతాయని చెప్పారు. ప్రజలు అంతరాయంకు సహకరించాలని కోరారు.